RNI No: TGTEL/25/A2649

VOICE OF PRAJALU

వాయిస్

ప్రజల గొంతుక - నిజం కోసం..

ఆఫ్ ప్రజలు



యాదాద్రి థర్మల్ ప్లాంట్‌లో గత పాలకుల తప్పిదాలు!

బొగ్గు లింకేజీ లేకుండానే నిర్మాణం..
ప్రాజెక్టు జాప్యంతో రాష్ట్రంపై ఆర్థిక భారం

సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే
తమ ప్రభుత్వ లక్ష్యమంటున్న పాలకులు

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMABAD ADILABAD

హైదరాబాద్ | సోమవారం, అక్టోబరు 12, 2026 | తెలుగు దినపత్రిక | సంపుటి:1 | సంచిక : 158 | పేజీలు: 8 | వెల : రూ.1



జేఎన్టీయూ శాశ్వత క్యాంపస్ నిర్మాణం వెంటనే చేపట్టాలి

విద్యార్థుల సమస్యలపై సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ విజ్ఞప్తి

రూ.402 కోట్లతో మంజూరైన నిర్మాణ పనులు ప్రారంభించాలి

కొత్త క్యాంపస్ పూర్తయ్యే వరకు ప్రస్తుత ప్రాంగణంలోనే కళాశాల కొనసాగించాలి

వాయిస్ టుడే న్యూస్ । రాజన్న సిరిసిల్ల : రాజన్న సిరిసిల్ల జిల్లాలోని జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. కళాశాల శాశ్వత క్యాంపస్ నిర్మాణంలో జరుగుతున్న జాప్యాన్ని నివారించి, విద్యార్థుల విద్యాభ్యాసానికి ఎలాంటి ఆటంకం కలగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. 2021లో రూ.402 కోట్ల పరిపాలనా అనుమతులతో మంజూరైన కళాశాల శాశ్వత క్యాంపస్ నిర్మాణం ఇప్పటికీ ప్రారంభం కాలేదని కేటీఆర్ పేర్కొన్నారు. మండేపల్లి గ్రామంలో 20 ఎకరాల భూమిని కేటాయించినప్పటికీ, నిర్మాణ పనులు చేపట్టకపోవడంతో కళాశాల ప్రస్తుతం అగ్రహారంలోని డిగ్రీ కళాశాల ప్రాంగణంలో

(మిగతా 2వ పేజీలో)

చెన్నైలో ప్రధాని మోదీకి సీఎం విజయ్ స్వాగతం

రూ.13 వేల కోట్ల విలువైన మెట్రో ప్రాజెక్టు ప్రారంభం



చెన్నై: తమిళనాడు పర్యటనకు వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీకి చెన్నై విమానాశ్రయంలో ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ ఘన స్వాగతం పలికారు. సోమవారం ఉదయం 11 గంటలకు ప్రత్యేక విమానంలో చెన్నై చేరుకున్న ప్రధానికి గవర్నర్ రాజేంద్ర అర్లేకర్, సీఎం విజయ్‌తో పాటు అన్నాడీఎంకే అధినేత ఎడప్పాడి కె. పళనిస్వామి, బీజేపీ నేత నైనార్ నాగేంద్రన్ స్వాగతం పలికారు. విమానాశ్రయం నుంచి పొరూర్ మెట్రో స్టేషన్ వరకు ప్రధాని రోడ్‌షో నిర్వహించారు. అనంతరం సీఎం విజయ్‌తో కలిసి పూనమల్లి--వడపళని మధ్య నూతనంగా నిర్మించిన చెన్నై మెట్రో ఫేజ్-2 మార్గాన్ని ప్రారంభించారు. అనంతరం ఇద్దరూ కలిసి మెట్రో రైలులో ప్రయాణించారు. ఈ ప్రాజెక్టుల విలువ సుమారు రూ.13,000 కోట్లు.



ఎల్‌నినో ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలి

తాగు, సాగునీటి ఎద్దడి తీవ్రం కావొచ్చు.. రైతులు రెండో పంట వేసి నష్టపోవద్దు

విద్యుత్ కొరతతోనూ ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం

పాలేరు నియోజకవర్గంలో అభివృద్ధి పనులను పరిశీలించిన రాష్ట్ర మంత్రి

వాయిస్ టుడే న్యూస్ । ఖమ్మం : రాబోయే రోజుల్లో ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో నీటి ఎద్దడి తీవ్రతరం అయ్యే ప్రమాదం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర మంత్రి సూచించారు. తాగునీరు, సాగునీటి అవసరాల విషయంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని పేర్కొన్నారు. రైతులు ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రెండో పంట సాగు చేసి నష్టపోవద్దని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే సాగు చేసిన తొలి పంటను కాపాడేందుకు ప్రభుత్వం శక్తివంచన లేకుండా కృషి చేస్తోందని తెలిపారు. దేశంలో విద్యుత్ కొరత ఏర్పడే అవకాశం ఉందని, దీంతో విద్యుత్ సరఫరా, ధరల పరంగా ఇబ్బందులు తలెత్తవచ్చని పేర్కొన్నారు. గతంలో యూనిట్ విద్యుత్ రూ.7కు లభించేదని, ప్రస్తుతం రూ.15 చెల్లించినా అందుబాటులోకి రాని పరిస్థితులు ఉన్నాయని వివరించారు.

పాలేరు నియోజకవర్గంలో అభివృద్ధి పనులు

ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గ పర్యటనలో భాగంగా జిల్లా కలెక్టర్, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పలు మండలాల్లో పర్యటించి అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. పెద్ద తండా ఇందిరమ్మ కాలనీలో రూ.2 కోట్లతో నిర్మించనున్న గిరిజన భవనానికి శంకుస్థాపన చేశారు. పొన్నెకల్ వద్ద రూ.200 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్

(మిగతా 2వ పేజీలో)



బహుజన తెలంగాణ కోసం బతుకమ్మ మరో ఉద్యమం కావాలి

ఓయూలో విద్యార్థులతో బతుకమ్మ ఆడిన తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత

ఓయూకు రూ.1,000 కోట్లు సాధించే వరకు పోరాడతాం.. ఈవీఎంలకు బదులు బ్యాలెట్ పేపర్ విధానంలో ఎన్నికలు జరగాలి

వాయిస్ టుడే న్యూస్ । హైదరాబాద్ : ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ సంబురాల్లో తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత పాల్గొన్నారు. విద్యార్థులతో కలిసి బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమంలో బతుకమ్మ పోషించిన పాత్రను గుర్తుచేస్తూ, బహుజన తెలంగాణ సాధనకు మరోసారి బతుకమ్మ ఉద్యమ స్ఫూర్తిగా మారాలని పిలుపునిచ్చారు. తెలంగాణ అస్తిత్వాన్ని ప్రపంచానికి చాటిచెప్పేందుకు గతంలో బతుకమ్మను ఉద్యమంలో భాగం చేశామని కవిత అన్నారు. తొలిదశ, మలిదశ తెలంగాణ ఉద్యమాల్లో ఉస్మానియా యూనివర్సిటీ పోషించిన పాత్రను తెలంగాణ సమాజం ఎప్పటికీ మర్చిపోదని పేర్కొన్నారు. బతుకమ్మలో వివిధ రకాల పూలు కలిసినట్లే భవిష్యత్ తెలంగాణలోనూ అన్ని వర్గాలకు సమాన అవకాశాలు, స్వేచ్ఛ, అధికారంలో ప్రాతినిధ్యం ఉండాలని ఆకాంక్షించారు. బతుకమ్మ పండుగ కేవలం వేడుకగా మిగిలిపోకూడదని, దాని వెనుక సామాజిక ప్రయోజనం ఉండాలని అన్నారు. మహిళలకు అండగా నిలవాల్సిన బాధ్యత పురుషులపైనా ఉందని పేర్కొన్నారు. తెలంగాణలో ఏ రాజకీయ పార్టీ ఉన్నా ఉస్మానియా విద్యార్థుల మద్దతు అవసరమని, తాను కూడా రాజకీయ పార్టీ స్థాపించి విద్యార్థుల ఆశీర్వాదం కోరుతున్నానని తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీ అభివృద్ధికి ముఖ్యమంత్రి రూ.1,000 కోట్లు ప్రకటించి ఆరు నెలలు గడిచినా

(మిగతా 2వ పేజీలో)

ఘనంగా సిద్ధిపేట జిల్లా ఆవిర్భావ దశాబ్ది వేడుకలు

మూడురోజుల సంబురాల్లో భారీగా పాల్గొన్న ప్రజలు

పదేళ్ల ప్రగతి, అభివృద్ధి, ఐక్యతకు ప్రతీకగా వేడుకలు



వాయిస్ టుడే న్యూస్ । సిద్ధిపేట : సిద్ధిపేట జిల్లా ఏర్పాటై పదేళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన దశాబ్ది వేడుకలు ఘనంగా జరిగాయి. మూడు రోజుల పాటు కొనసాగిన ఈ వేడుకలకు ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. జిల్లా ఆవిర్భావం నుంచి పదేళ్ల ప్రయాణాన్ని గుర్తుచేసుకుంటూ ప్రగతి, అభివృద్ధి, ప్రజల ఐక్యతను చాటిచెప్పేలా సంబురాలు నిర్వహించారు. జిల్లా ఏర్పాటుతో పరిపాలన ప్రజలకు మరింత చేరువ కావడం, స్థానిక అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు అవకాశాలు పెరగడం వంటి అంశాలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. పదేళ్లలో జిల్లాలో చోటుచేసుకున్న మార్పులు, అభివృద్ధి ప్రయాణాన్ని ప్రతిబింబించేలా వేడుకలు కొనసాగాయి. మూడు రోజుల పాటు జరిగిన కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జిల్లా ఆవిర్భావ దశాబ్ది వేడుకలు స్థానిక ప్రజల్లో ఉత్సాహాన్ని నింపాయి. సిద్ధిపేట జిల్లా సాధించిన ప్రగతిని గుర్తుచేసుకుంటూ, భవిష్యత్తులో మరింత అభివృద్ధి సాధించాలనే ఆకాంక్షను ఈ వేడుకలు ప్రతిబింబించాయి.

బీజేపీ భవిష్యత్ కార్యాచరణపై కీలక సమావేశం

రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు అధ్యక్షతన ఎంపీలు, ఎమ్మెల్యేలు, మాజీ ప్రజాప్రతినిధుల భేటీ



వాయిస్ టుడే న్యూస్ । హైదరాబాద్ : బీజేపీ రాష్ట్ర భవిష్యత్ కార్యాచరణపై చర్చించేందుకు హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు అధ్యక్షతన ఎంపీలు, ఎమ్మెల్యేలు, మాజీ ప్రజాప్రతినిధుల సమావేశం నిర్వహించారు. పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యక్రమాలు, అనుసరించాల్సిన కార్యాచరణపై ఈ సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల సహ ఇన్‌చార్జి అభయ్ పాటిల్, శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, పార్టీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి మధుకర్ పాల్గొన్నారు. అలాగే ఎంపీలు డీకే అరుణ, డాక్టర్ కె. లక్ష్మణ్, ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, అర్వింద్ ధర్మపురి, ఎమ్మెల్యే పాల్వాయి హరీష్, ఎమ్మెల్సీ అంజిరెడ్డితో పాటు పలువురు మాజీ మంత్రులు, మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు హాజరయ్యారు.

వాయిస్ ఆఫ్ ప్రజలు

సోమవారం, అక్టోబరు 12, 2026

మీ రాకతో మా గ్రామానికి పండుగ వచ్చింది!

అడవిబాటలో వెలుగులు నింపుతున్నారంటూ పవన్ కళ్యాణ్‌కు గిరిజనుల కృతజ్ఞతలు

రహదారులు, అంబులెన్సులు లేక గతంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాం

సమస్యలు విన్న వెంటనే పరిష్కారానికి ఆదేశాలు

రాకోటలో గ్రామమంతా కలియదిరిగి రహదారులు పరిశీలించిన ఉప ముఖ్యమంత్రి



వాయిస్ టుడే న్యూస్ । రాకోట : “మీరు రాకముందు అడవి మధ్యన ఉన్న మా బతుకుల్లో వెలుగులు లేవు.. మా గ్రామాలకు రహదారులు లేవు.. ఆటోలు, అంబులెన్సులు వచ్చేవి కావు.. మీ రాకతో మా గ్రామానికి పండుగ వచ్చింది. మీరు ఆరోగ్యంగా ఉంటే రాష్ట్రం క్షేమంగా ఉంటుంది. ముఖ్యంగా మా గిరిజన గ్రామాలు మరింత క్షేమంగా ఉంటాయి” అంటూ గిరిజన గ్రామాల ప్రజలు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తమ గ్రామాల సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఆయన పర్యటన గ్రామాల అభివృద్ధికి ముందడుగుగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పోలవరం జిల్లా రంపచోడవరం నియోజకవర్గంలోని రాకోట గ్రామంలో నిర్వహించిన ‘మన ఊరు--మాటా మంతి’ కార్యక్రమంలో గిరిజనులు తమ సమస్యలను ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలు వివరించిన సమస్యలపై స్పందించిన పవన్ కళ్యాణ్, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

మా రియల్ లైఫ్ హీరో మీరు

రాకోటకు చెందిన కుర్ల కృష్ణవేణి మాట్లాడుతూ.. ఉప ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టక ముందు రహదారులు లేక తమ గ్రామ ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. తమ సమస్యలను గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకున్నందుకు కృతజ్ఞతలు చెప్పారు. “మీరు మా రియల్ లైఫ్ హీరో సర్. మీ రాక మాకు జీవితాంతం గుర్తుంటుంది” అని పేర్కొన్నారు.

చీమగండి--కాకవాడ రోడ్డుకు మరమ్మతులు చేయించాలని వినతి

వేములకొండకు చెందిన మహిళ చీమగండి--కాకవాడ గ్రామాల మధ్య రహదారి దెబ్బతిన్న విషయాన్ని పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై వెంటనే స్పందించిన ఉప ముఖ్యమంత్రి రహదారికి మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

రాకోటను రెవెన్యూ గ్రామంగా గుర్తించాలి

సుమారు 350 మంది జనాభా కలిగిన రాకోట గ్రామం వేములకొండ గ్రామ పంచాయతీ పరిధిలో ఉంది. తమ గ్రామాన్ని ప్రత్యేక రెవెన్యూ గ్రామంగా గుర్తించి అధికారిక గుర్తింపు కల్పించాలని గ్రామానికి చెందిన కుర్ల బాలకృష్ణారెడ్డి కోరారు. ఈ అంశంపై సాధ్యాసాధ్యాలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. గ్రామ పెద్ద సోమిరెడ్డి కూడా గ్రామంలోని సమస్యలను ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. పాముకాటుకు సంబంధించిన యాంటీ స్నేక్ వెనం మందులను అందుబాటులో ఉంచాలని కోరగా, అవసరమైన డోసులు ఇప్పటికే అందుబాటులో ఉంచినట్లు పవన్ కళ్యాణ్ తెలిపారు.

గ్రామమంతా కలియదిరిగి రహదారుల పరిశీలన

మాటా మంతి కార్యక్రమానికి ముందు పవన్ కళ్యాణ్ రాకోట గ్రామమంతా పర్యటించి, అక్కడ నిర్మించిన సీసీ రహదారులను పరిశీలించారు. రహదారుల పక్కన షోల్డర్లు తక్కువ ఎత్తులో ఉండటాన్ని గమనించి, వాటిని సరిచేయాలని అధికారులకు సూచించారు. గ్రామానికి చెందిన చెదలవాడ విజయలక్ష్మితో మాట్లాడి స్థానికుల వృత్తులు, జీవన పరిస్థితుల గురించి తెలుసుకున్నారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు వేయలేకపోయామని ఆమె వివరించడంతో, వాతావరణ పరిస్థితులకు అనుకూలమైన విత్తనాలు అందించే ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్‌కు సూచించారు. అడవితల్లి బాట కార్యక్రమ ప్రారంభోత్సవానికి వచ్చిన సమయంలో తన చిన్న కుమారుడు అగ్నిప్రమాదానికి గురైనప్పటికీ, ప్రజా కార్యక్రమాలను పూర్తి చేసి గ్రామస్థుల సమస్యలను తెలుసుకున్నారని గిరిజనులు పవన్ కళ్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మాటా మంతి కార్యక్రమం అనంతరం గ్రామంలోని 40 మంది యువకులకు వాలీబాల్, క్రికెట్ కిట్లను అందజేశారు. గిరిజన గ్రామాల్లో రహదారులు, వైద్యం, విద్య, ఉపాధి వంటి మౌలిక సదుపాయాలు మెరుగుపడాలని, తమ సమస్యలకు పరిష్కారం లభించాలని ఈ సందర్భంగా గ్రామస్థులు ఆకాంక్షించారు.

బహుజన తెలంగాణ కోసం బతుకమ్మ మరో ఉద్యమం కావాలి



నిధులు విడుదల కాలేదని కవిత విమర్శించారు. ప్రకటించిన నిధులను ప్రభుత్వం నుంచి సాధించే వరకు పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. యూనివర్సిటీలో విద్యార్థులకు కనీస సౌకర్యాలు కూడా అందడం లేదని, హాస్టళ్లలో ఒక గదిలో ఎనిమిది మంది ఉండాల్సిన పరిస్థితి ఉందని, తాగునీటి సమస్యలు ఉన్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో అధ్యాపకుల కొరత తీవ్రంగా ఉందని, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు పెద్ద సంఖ్యలో ఖాళీగా ఉన్నాయని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా యూనివర్సిటీల సమస్యలను తగిన స్థాయిలో పరిష్కరించలేదని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్నందుకు మరోసారి క్షమాపణలు చెబుతున్నానని అన్నారు. యూనివర్సిటీలు కేవలం డిగ్రీలు ఇచ్చే విద్యాసంస్థలుగా కాకుండా నాయకులను తయారు చేసే కేంద్రాలుగా ఎదగాలని కవిత అభిప్రాయపడ్డారు. పీవీ నరసింహారావు, జార్జ్ రెడ్డి, గద్దర్ వంటి ప్రముఖులు ఉస్మానియా యూనివర్సిటీతో అనుబంధం కలిగి ఉన్నారని గుర్తుచేశారు. విద్యార్థి సంఘాల ఎన్నికలు తిరిగి నిర్వహించాలని, యువత నాయకత్వ లక్షణాలను పెంపొందించుకునే అవకాశాలు కల్పించాలని కోరారు.

ఈవీఎంలకు బదులు బ్యాలెట్ పేపర్ కావాలి

కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో పాటు మొత్తం ఎన్నికల వ్యవస్థలో మార్పులు రావాలని కవిత అన్నారు. ఎన్నికల కమిషనర్ మారినంత మాత్రాన సమస్య పరిష్కారం కాదని, ఈవీఎంలకు బదులుగా బ్యాలెట్ పేపర్ విధానంలో ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై ప్రజలు, విద్యార్థులు నిర్భయంగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ గతంలో రోహిత్ వేముల చట్టం తీసుకొస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేస్తూ, ఆ హామీ అమలుపై ప్రశ్నించారు. అశోక్‌నగర్‌లో నిరుద్యోగులకు ఇచ్చిన జాబ్ క్యాలెండర్ హామీపై కూడా ప్రభుత్వం సమాధానం చెప్పాలని అన్నారు. విద్యార్థులు కేవలం అనుచరులుగా మిగిలిపోకుండా నాయకులుగా ఎదగాలని కవిత సూచించారు. పేద కుటుంబాల పిల్లలకు కూడా రాజకీయాల్లో, అధికార వ్యవస్థలో భాగస్వామ్యం లభించాలని, అందుకు యూనివర్సిటీల్లో స్వేచ్ఛాయుత ఆలోచనలు, చర్చలకు అవకాశం ఉండాలని పేర్కొన్నారు. బహుజన తెలంగాణ, సమానత్వం, విద్యార్థుల హక్కులు, యూనివర్సిటీల అభివృద్ధి కోసం విద్యార్థులు మరోసారి ఉద్యమ స్ఫూర్తితో ముందుకు రావాలని కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు.

యాదాద్రి థర్మల్ ప్లాంట్‌లో గత పాలకుల తప్పిదాలు!

బొగ్గు లింకేజీ లేకుండానే నిర్మాణం.. ప్రాజెక్టు జాప్యంతో రాష్ట్రంపై ఆర్థిక భారం

సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే తమ ప్రభుత్వ లక్ష్యమంటున్న పాలకులు



వాయిస్ టుడే న్యూస్ । హైదరాబాద్ : యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణంలో గత పాలకులు సరైన ప్రణాళిక లేకుండా వ్యవహరించారని, దీంతో ప్రాజెక్టు వ్యయం పెరిగి రాష్ట్రంపై ఆర్థిక భారం పడిందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అవసరమైన బొగ్గు సరఫరాపై ముందస్తు ఏర్పాట్లు చేయకుండానే ప్లాంట్ నిర్మాణం చేపట్టడం, పర్యావరణ అనుమతుల విషయంలో జాప్యం జరగడం ప్రాజెక్టుపై ప్రభావం చూపాయని ఆరోపణలు ఉన్నాయి. ప్లాంట్‌కు అవసరమైన +9 గ్రేడ్ బొగ్గు లభ్యతపై స్పష్టత లేకుండానే నిర్మాణం చేపట్టారని విమర్శకులు పేర్కొంటున్నారు. విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టుకు అవసరమైన ఇంధన సరఫరాపై ముందస్తు భరోసా లేకపోవడం వల్ల సమస్యలు తలెత్తాయని ఆరోపిస్తున్నారు. సరైన ప్రణాళిక లేకుండా ప్రాజెక్టును చేపట్టడం రాష్ట్రానికి నష్టం కలిగించిందని విమర్శిస్తున్నారు. 2017 నాటికే పూర్తికావాల్సిన ప్రాజెక్టు నిర్మాణంలో తీవ్ర జాప్యం జరిగిందని, పర్యావరణ అనుమతులకు సంబంధించిన అంశాలు, జాతీయ హరిత ట్రిబ్యునల్ (NGT)లో తలెత్తిన వివాదాలు కూడా ప్రాజెక్టు పురోగతిపై ప్రభావం చూపాయని పేర్కొంటున్నారు. మరోవైపు, రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని ప్రస్తుత పాలకులు చెబుతున్నారు. పేదల అభ్యున్నతికి ప్రాధాన్యమిస్తూ పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని పేర్కొంటున్నారు. గత పాలనలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ ముందుకు సాగుతామని స్పష్టం చేస్తున్నారు.

70 మ్యూల్ అకౌంట్లతో సైబర్ మోసాలు.. హైదరాబాద్‌లో ఇద్దరి అరెస్ట్

సైబర్ నేరగాళ్లకు మ్యూల్ అకౌంట్లు సరఫరా చేస్తున్న ఇద్దరి అరెస్ట్



సైబర్ నేరగాళ్లకు బ్యాంకు ఖాతాలు (మ్యూల్ అకౌంట్లు) సరఫరా చేస్తూ భారీ మోసాలకు సహకరిస్తున్న ఇద్దరు వ్యక్తులను హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. వీరు అందించిన సుమారు 70 మ్యూల్ అకౌంట్ల ద్వారా దేశవ్యాప్తంగా 450 సైబర్ క్రైమ్ కేసులు నమోదయ్యాయని, వీటిలో రూ.60 నుంచి 70 కోట్ల వరకు లావాదేవీలు జరిగాయని పోలీసులు ఆదివారం వెల్లడించారు. రామాంతపూర్‌కు చెందిన గుమ్మ రమేశ్ (39), ముదలె అనిల్ (19) అనే ఇద్దరిని నిందితులుగా గుర్తించారు. ఫేస్‌బుక్ ద్వారా పాత రూపాయి నోటుకు రూ.45 లక్షలు ఇస్తామని నమ్మించి, ఓ బాధితుడి నుంచి రూ.7,93,351 వసూలు చేసిన మోసంపై అందిన ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో భాగంగా దర్యాప్తు చేయగా ఈ భారీ నెట్‌వర్క్ గుట్టు రట్టయింది. బాధితుడి ఫిర్యాదు మేరకు ఐటీ చట్టంలోని సెక్షన్లు 66జ, 66ణ లతో పాటు బీఎన్ఎస్ చట్టంలోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. విచారణలో నిందితులు తమ నేరాన్ని అంగీకరించినట్లు సైబర్‌క్రైమ్ పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జ్ డీసీపీ ఎస్. చైతన్య కుమార్ తెలిపారు. తమ సంపాదన సరిపోకపోవడంతో, సులభంగా డబ్బు సంపాదించేందుకు ఈ మార్గాన్ని ఎంచుకున్నట్లు నిందితులు చెప్పారన్నారు. ప్రధాన నిందితుడు రమేష్ గతంలో కర్ణాటకలోని బీదర్‌లో నివసించి, ఆర్థిక ఇబ్బందులతో హైదరాబాద్‌కు వచ్చి క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో సైబర్ నేరగాళ్లతో పరిచయాలు పెంచుకున్నాడు. పరారీలో ఉన్న మరో నిందితుడితో కలిసి రామాంతపూర్ పరిసరాల్లోని విద్యార్థులు, డెలివరీ పార్ట్‌నర్లకు కమిషన్ ఆశ చూపి, వారి పేర్లతో బ్యాంకు ఖాతాలు తెరిపించాడు. ఇలా సేకరించిన దాదాపు 70 అకౌంట్లకు సంబంధించిన పాస్‌బుక్‌లు, ఏటీఎం కార్డులు, సిమ్ కార్డులను హరియాణాలోని సైబర్ నేరగాళ్లకు కొరియర్ ద్వారా పంపేవాడు. రెండో నిందితుడైన అనిల్, రమేశ్ నుంచి కమిషన్ తీసుకుని మూడు బ్యాంకుల్లో ఖాతాలు తెరిచి, వాటి వివరాలను అతనికి అందజేశాడు. ఈ కేసులో పరారీలో ఉన్న నిందితుడితో పాటు ప్రధాన సైబర్ ముఠా కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.



ఢిల్లీకి టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

ఓటర్ల సవరణ ప్రక్రియలో అక్రమాలపై ఇండియా కూటమి మహాధర్నా

వాయిస్ టుడే న్యూస్ । హైదరాబాద్ : ఓటర్ల సవరణ ప్రక్రియలో జరుగుతున్న అక్రమాలను నిరసిస్తూ, కేంద్ర ఎన్నికల సంఘం (CEC) జ్ఞానేశ్వర్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఇండియా కూటమి చేపట్టనున్న మహాధర్నాలో పాల్గొనేందుకు తెలంగాణ కాంగ్రెస్ నేతల బృందం ఢిల్లీకి బయలుదేరింది. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌తో పాటు సహచర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఓటర్ల సవరణ ప్రక్రియలో పారదర్శకతను పాటించాలని, ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ ఇండియా కూటమి ఆధ్వర్యంలో ఈ మహాధర్నా నిర్వహించనున్నారు. ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని, ఎన్నికల సంఘం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కాంగ్రెస్ నేతలు కోరుతున్నారు.

జేఎన్టీయూ శాశ్వత క్యాంపస్ నిర్మాణం వెంటనే చేపట్టాలి

తాత్కాలికంగా కొనసాగుతోందని తెలిపారు. ప్రస్తుత ప్రాంగణం నుంచి కళాశాలను మరో ప్రైవేటు భవనానికి తరలించే ప్రతిపాదనలు విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందికి ఇబ్బందులు కలిగించే అవకాశం ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. ఇప్పటికే అందుబాటులో ఉన్న తరగతి గదులు, ప్రయోగశాలలు, ఇతర మౌలిక సదుపాయాలు నిరుపయోగం కాకుండా చూడాలని సూచించారు. మండేపల్లిలో కేటాయించిన స్థలంలో శాశ్వత క్యాంపస్ నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేసి, పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రిని కోరారు. కొత్త క్యాంపస్ నిర్మాణం పూర్తయ్యే వరకు కళాశాలను ప్రస్తుత ప్రాంగణంలోనే కొనసాగించేందుకు అనుమతించాలని విజ్ఞప్తి చేశారు. తగిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు జరిగే వరకు ప్రస్తుత ప్రాంగణాన్ని ఖాళీ చేయాలంటూ నోటీసులు జారీ చేయకుండా సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

విద్యార్థుల భవిష్యత్తుకు ప్రాధాన్యం ఇవ్వాలి

రాజన్న సిరిసిల్ల జిల్లాతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్య అందించడంలో జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల కీలక పాత్ర పోషిస్తోందని కేటీఆర్ పేర్కొన్నారు. క్యాంపస్ నిర్మాణంలో జాప్యం, కళాశాల తరలింపు వంటి అంశాల వల్ల విద్యార్థుల చదువుకు ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని శాశ్వత క్యాంపస్ నిర్మాణం, ప్రస్తుత కళాశాల నిర్వహణకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే జోక్యం చేసుకోవాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.

ఎల్‌నినో ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలి

భవన సముదాయాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వచ్చే ఏడాది జూన్ నాటికి నిర్మాణ పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మంగలి తండా నుంచి దుబ్బతండా వరకు రూ.1.63 కోట్లతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. జుజ్జులరావుపేటలో రూ.45 లక్షలతో నిర్మించనున్న ఓవర్‌హెడ్ ట్యాంకు, పైపులైన్ పనులకు శంకుస్థాపన చేశారు. రూ.20 లక్షలతో నిర్మించిన హట్యా తండా గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం కూసుమంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 30 మంది కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు మొత్తం రూ.30,03,480 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. తెట్టెలపాడు నుంచి బీరోలు వరకు రూ.6.50 కోట్లతో నిర్మించనున్న బీటీ రహదారికి శంకుస్థాపన చేశారు. సుబ్లేడులో నిర్మించిన గ్రామ మహిళా సమాఖ్య భవనాన్ని ప్రారంభించారు. తిరుమలాయపాలెం మండలానికి చెందిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. నీటి వనరుల లభ్యత, విద్యుత్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు వ్యవసాయ నిర్ణయాలు తీసుకోవాలని, ప్రజలు నీటి వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని మంత్రి సూచించారు.



చిన్నారి కుటుంబాన్ని పరామర్శించిన ఈటల రాజేందర్


నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి

చిన్నారుల భద్రతకు పటిష్ట చర్యలు అవసరం

వాయిస్ టుడే న్యూస్ । హైదరాబాద్ : కౌకూర్‌లోని విల్లా ఆర్కేడ్‌లో ఐదేళ్ల చిన్నారి అరాలియా (మోను) హత్యకు గురైన ఘటన నేపథ్యంలో బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. చిన్నారి మృతికి కారణమైన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ చిన్నారుల భద్రత విషయంలో తల్లిదండ్రులు, అపార్ట్‌మెంట్ యాజమాన్యాలు, సంబంధిత అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వలస కార్మికుల నియామకంలో వారి వివరాలను పరిశీలించే విధానాన్ని పటిష్టం చేయాలని, నేరాల నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ కార్యకలాపాలను అరికట్టేందుకు పోలీసులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. చిన్నారి కుటుంబానికి న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఈటల రాజేందర్ కోరారు.

ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి నా వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయి

బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్



కుత్బుల్లాపూర్ అక్టోబర్ 11(వాయిస్ టుడే): తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీలో ఇటీవల జరిగిన కార్మిక సంఘాల ఎన్నికల్లో జీడిమెట్ల డిపో నుంచి బరిలోకి దిగిన ఎంప్లాయిస్ యూనియన్ – ఈఎంయూ – ఎన్ఎంయూ కూటమి ప్రత్యర్థి కూటమి అయినా ఈడబ్ల్యూయూ – టిడబ్ల్యూయూ – ఐఎన్టియుసి కూటమిపై 68 ఓట్ల మెజార్టీతో గెలుపొందగా జలిగం రాకేష్ అధ్యక్షులుగా గెలిచారు. ఈ సందర్భంగా ఉదయం కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద జీడిమెట్ల డిపోకు చెందిన ఎంప్లాయిస్ యూనియన్ – ఈఎంయూ – ఎన్ఎంయూ కూటమి సభ్యులు గౌరవాధ్యక్షులు జలిగం రాకేష్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ మాట్లాడుతూ.... కార్మిక సంఘాల ఎన్నికలలో గెలుపు కార్మికుల సంక్షేమం పట్ల నూతన కమిటీ సభ్యులపై మరింత బాధ్యతను పెంచుతుందని, కార్మిక సంక్షేమం విషయంలో నూతన కమిటీకి నావంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయన్నారు. అనంతరం అధ్యక్షులుగా ఎన్నికైన జలిగం రాకేష్ ను ఎమ్మెల్యే శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిపో సెక్రెటరీ కోల రాజేష్, గ్రేటర్ హైదరాబాద్ ప్రెసిడెంట్ గోవర్ధన్ రాపోలు, బాబు, అధ్యక్షులు జ్ఞానేశ్వర్, జేఏసీ చైర్మన్ రాజేందర్ రెడ్డి, సభ్యులు పాషా, అంకం రావు, బిఎల్.నారాయణ, మహిళా నాయకురాలు క్రిష్ణ భాయ్, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



బాచుపల్లిలో దుర్గామాతను దర్శించుకున్న కొలన్ హన్మంత్ రెడ్డి

కుత్బుల్లాపూర్ అక్టోబర్ 11(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బాచుపల్లిలో దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నసుయ్ నాయకులు గోంగుల నవీన్ ఏర్పాటు చేసిన దుర్గామాత మండపంలో మొదట్టి రోజు బాల త్రిపుర సుందరి అవతారంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హన్మంత్ రెడ్డి. ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ చీట్ల దివాకర్, డివిజన్ అధ్యక్షులు కొలన్ జీవన్ రెడ్డి, సిద్ధనోళ్ల సంజీవరెడ్డి, మరియు తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీలో భారీ చేరికలు

కుత్బుల్లాపూర్ అక్టోబర్ 11(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, బౌరంపేట్ డివిజన్ లోని ఇందిరమ్మ కాలనీ లోని పలువురు బిఆర్ఎస్ పార్టీ నాయకులు నేడు మాజీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ లో చేరడం జరిగింది. ఈ సందర్భంగా నర్సారెడ్డి భూపతిరెడ్డి మాట్లాడుతూ మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని, ప్రజా ప్రభుత్వం పట్ల ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులకు శుభాకాంక్షలు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ముత్యం రెడ్డి,బౌరంపేట్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అర్కల విజయ్ గౌడ్, బౌరంపేట్ మాజీ సర్పంచ్ మిద్దెల యాదిరెడ్డి, సీనియర్ నాయకులు నర్సారెడ్డి వీరారెడ్డి, నర్సారెడ్డి బాల్ రెడ్డి, దమ్మగారి వెంకటరెడ్డి,దుండిగల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జక్కుల మల్లేష్ యాదవ్, జిల్లా ఫిషర్మన్ కాంగ్రెస్ చైర్మన్ పోచి మహేష్, జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి సాల్మన్ రాజు, బౌరంపేట్ ఎస్సీ సెల్ చైర్మన్ చింతకింది సురేష్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు. పార్టీలో చేరిన వారిలో కూరపాటి జయకుమార్, దైవమణి,గంట శ్రీనివాస్, విశ్వనాధ్, రాజు, ప్రకాష్, భక్తవత్సల రెడ్డి, వెంకటేష్,గౌసుద్దీన్,శ్రీనివాస్, గంగాధర్, అనిల్, భాస్కర్, అనిల్ కుమార్, శంకర్, గణపతి అఖిల్, విశ్వనాధ్, వరలక్ష్మి, నాగలక్ష్మి, అఖిల్ తదితరులు ఉన్నారు.

బండారి లేఔట్ డివిజన్ ఎస్సి సెల్ నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపిన కోలన్ హన్మంత్ రెడ్డి



కుత్బుల్లాపూర్ అక్టోబర్ 11(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని బండారి లేఔట్ డివిజన్ ఎస్సి సెల్ నూతన కమిటీ సభ్యుల ఎంపిక కార్యక్రమం డివిజన్ అధ్యక్షులు వాసు సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బాచుపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హన్మంత్ రెడ్డి చేతుల మీదుగా నూతన కమిటీ సభ్యులు నియామక పత్రాలను అందుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా కోలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ అంకితభావంతో కృషి చేయాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉంటూ, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. నూతన కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేస్తూ పార్టీ అభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు కొలన్ జీవన్ రెడ్డి, వరగాణి వాసు , సిద్ధనోళ్ల సంజీవరెడ్డి, నిజాంపేట్ సర్కిల్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి మరియు డివిజన్ చైర్మన్ గుడ్ల అనిల్ కుమార్, వైస్ చైర్మన్లు గుడ్ల ప్రవీణ్ కుమార్, కె. రాజు, రెడ్డిమల రామ, డి. సంధ్యా రాణి, ఏ. సాయినాథ్, జనరల్ సెక్రటరీలు గుడ్ల నాగరాజు, మాదాస్ శివకుమార్, మెడిగడ్డ పులేంద్ర, కంబిలి బండప్ప, చెక్క పవన్ కుమార్, చింత కళ్యాణ్, కె. జీవన్ రాజు, కె. నరసింహారావు, డివిజన్ సోషల్ మీడియా కోఆర్డినేటర్: అనంతు విజయ్ కుమార్ , కార్యదర్శులు, డివిజన్ ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎస్సీ సెల్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేసుకోవాలె

బీసీ కులా సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి



నాచారం (వాయిస్ టుడే): యువత ప్రభుత్వాలపై ఆధారపడకుండా కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేసుకొని ఇతరులకు ఉపాధి కల్పించాలని బిసి కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి సూచించారు. ఆదివారం నాగారం సత్యనారాయణ కాలనీలో వల్లబోజు బ్రహ్మచారి, లత నేతృతంలో నెలకొల్పిన మహాలక్ష్మి జూలరీ షాప్ 1 గ్రామ్ గోల్డ్ సిల్వర్ షాప్‌ను ముఖ్యఅతిథిగా కుందారం గణేష్ చారి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్కెట్ కు అనుగుణంగా నూతన టెక్నాలజీతో షోరూమ్ ను ఏర్పాటు చేసినందుకు నిర్వాహకులను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువత ఉద్యోగం కోసం పరిగెత్తకుండా మేధస్సుకు పని పెట్టి స్వతహాగా కంపెనీలు పెట్టి పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఉద్యోగం కోసం కాకుండా ఉపాధి కల్పించే విధంగా నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వల్లబోజు నరసింహ చారి, ఓంకారా చారి, నరేందర్, చంద్రమౌళి, సిద్ధాచారి, ఎర్ర మల్లారెడ్డి, భూపాల్ రెడ్డి, దీపిక తదితరులు పాల్గొన్నారు.

నారాయణగూడలో ఘనంగా కరాటే కలర్ బెల్ట్ ప్రదానోత్సవం



హైదరాబాద్, అక్టోబర్ 11: జి.వి.ఆర్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో నారాయణగూడలోని అకాడమీ ప్రాంగణంలో ఆదివారం కలర్ బెల్ట్ గ్రేడింగ్, బెల్ట్ మరియు సర్టిఫికెట్ల ప్రదానోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ గ్రేడింగ్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన 48 మంది విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా కలర్ బెల్టులు, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమానికి హిమాయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్న గౌడ్, నేతాజీ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ డైరెక్టర్ కోట్ల నిరంజన్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులను అభినందించారు.

ఈ సందర్భంగా మహాలక్ష్మి రామన్న గౌడ్ మాట్లాడుతూ, కరాటే సాధనతో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, ఆత్మరక్షణ నైపుణ్యాలు పెంపొందుతాయని తెలిపారు. కరాటే అనేది వయసుతో సంబంధం లేని విద్య అని, ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులకు, యువతకు, ముఖ్యంగా బాలికలకు ఈ శిక్షణ ఎంతో అవసరమని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇస్తూ, శారీరకంగా, మానసికంగా బలంగా తయారవ్వాలని పిలుపునిచ్చారు.

అనంతరం నేతాజీ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ డైరెక్టర్ కోట్ల నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు ఈ విజయంతో సంతృప్తి చెందకుండా రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చాటేలా మరింత కష్టపడి సాధన చేయాలని సూచించారు.

అకాడమీ డైరెక్టర్ డాక్టర్ జి.ఎస్. గోపాల్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులలో క్రమశిక్షణ, ఆత్మరక్షణ నైపుణ్యాలను పెంపొందించడమే తమ అకాడమీ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. విద్యార్థుల పురోగతికి సహకరిస్తున్న తల్లిదండ్రులకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో అకాడమీ బ్లాక్ బెల్ట్ సభ్యులు కరీం, అమృత రెడ్డి, సుభాష్, ఘన సంతోషం రెడ్డి, రాజు, మహేందర్, సుధాకర్, అవిజ్ఞ వెంకట్ రెడ్డి, ద్వితలతో పాటు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



శ్రీ నల్ల పోచమ్మ ఆలయంలో వైభవంగా చండీ హోమం, అన్నదానం

హైదరాబాద్, అక్టోబర్ 11: సర్వపితృ అమావాస్యను పురస్కరించుకుని శనివారం కోటి రాణీ పార్క్ సమీపంలోని శ్రీ నల్ల పోచమ్మ దేవాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో చండీ హోమాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన ఈ హోమంలో భక్తులు విశేషంగా పాల్గొని పూజలు నిర్వహించారు. లోకకళ్యాణం, శాంతి, సమృద్ధిని కాంక్షిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. హోమ క్రతువు అనంతరం మధ్యాహ్నం 12:30 గంటల నుంచి భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

బజరంగ్ సేనా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ ఎన్.ఆర్. లక్ష్మణ్ రావు సౌజన్యంతో ఈ అన్నదాన సేవ జరిగింది. సర్వపితృ అమావాస్య పర్వదినాన సమాజంలో సేవాభావాన్ని పెంపొందించడం, భక్తిశ్రద్ధలను చాటుకోవడం ప్రశంసనీయమని పలువురు కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులతో పాటు రామేశ్వర్, సంగం, రవి మరియు ఇతర ముఖ్య సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు. స్వామివారి తీర్థప్రసాదాలు, అన్నప్రసాద వితరణతో కార్యక్రమం ముగిసింది.

స్థానిక ఎన్నికల్లో పర్యావరణ కార్యకర్తలకు ప్రాధాన్యమివ్వాలి

ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డెవలప్మెంట్ కౌన్సిల్ అధ్యక్షుడు ఎస్సీహెచ్ రంగయ్య



హైదరాబాద్, అక్టోబర్ 11: సమాజ ప్రగతికి పర్యావరణం గుండెకాయ వంటిదని, భావితరాల మనుగడకు ప్రకృతి పరిరక్షణే పునాది అని ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్సీహెచ్ రంగయ్య పేర్కొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పర్యావరణ పరిరక్షణ పట్ల నిబద్ధత, సామాజిక బాధ్యత కలిగిన వ్యక్తులకు రాజకీయ పార్టీలు అభ్యర్థులుగా అవకాశం కల్పించాలని ఆదివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

వాతావరణ మార్పులు, నీటి కొరత, కాలుష్యం, తగ్గిపోతున్న పచ్చదనం వంటి సమస్యలను ఎదుర్కోవాలంటే పర్యావరణంపై అవగాహన కలిగిన ప్రజాప్రతినిధులు స్థానిక పాలనలో కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో పర్యావరణ కార్యకర్తలకు ప్రాతినిధ్యం కల్పిస్తే చెరువుల సంరక్షణ, వర్షపు నీటి యాజమాన్యం, మొక్కల పెంపకం, వ్యర్థాల నిర్వహణ వంటి అంశాలపై క్షేత్రస్థాయిలో సమర్థవంతమైన చర్యలు తీసుకునే వీలుంటుందని తెలిపారు. స్థానిక సమస్యలపై ప్రజాప్రతినిధులు గళమెత్తినప్పుడే ఉన్నతస్థాయి పాలకులు, చట్టసభల దృష్టికి వాటి తీవ్రత చేరుతుందన్నారు. ముఖ్యంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో రాబోయే స్థానిక ఎన్నికల్లో పర్యావరణ భావజాలం కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యం ఇస్తామని రాజకీయ పార్టీలు ప్రకటించాలని, ప్రజలు కూడా ప్రకృతిని కాపాడే నాయకులను గెలిపించి భావితరాల భవిష్యత్తుకు భరోసా ఇవ్వాలని పిలుపునిచ్చారు.

సేవలో తండ్రి అడుగుజాడలు... క్రీడల్లో తనయ విజయకేతనాలు!

విద్య, క్రీడలు, ఎన్‌సీసీ, సాంస్కృతిక రంగాల్లో పెరుక వృంద బహుముఖ ప్రతిభ



తల్లిదండ్రులు పిల్లలకు అందించే గొప్ప వారసత్వం ఆస్తిపాస్తులు కాదు... ఆదర్శాలు, సంస్కారం, మానవీయ విలువలు. అలాంటి విలువలను తండ్రి నుంచి పుణికిపుచ్చుకొని విద్య, క్రీడలు, సాహస కార్యక్రమాలు, ఎన్‌సీసీ, సాంస్కృతిక రంగాల్లో తనదైన ముద్ర వేస్తున్న యువతి పెరుక వృంద.

ప్రముఖ కవి, రచయిత, విమర్శకుడు, బహుభాషావేత్త, భారత సైన్యంలో జూనియర్ అధికారి డా. పెరుక రాజు మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం. 'ప్రోత్సాహమే గొప్ప బహుమతి' అనే నినాదంతో 'మై గిఫ్ట్' సేవా సంస్థకు రూపశిల్పిగా నిలిచి, తాను ఎక్కడ ఉంటే అక్కడ సేవా కార్యక్రమాలు చేపట్టడం ఆయన ప్రత్యేకత. దేశమంతా తన ఊరేనని, సమాజమంతా తన కుటుంబమేనని భావించే ఆయన నిరాడంబర జీవనానికి ప్రాధాన్యమిస్తారు. మద్యానికి, మాంసాహారానికి దూరంగా ఉంటూ, బాల్యంలో ఎదుర్కొన్న పేదరికాన్ని, కష్టాలను విజయానికి మెట్లుగా మలచుకున్నారు.



కానిస్టేబుల్ వెంకట్ రామ్ కుటుంబానికి రూ.3 లక్షల ఆర్థిక సాయం

హైద్రాబాద్ (వాయిస్ టుడే): 2009 బ్యాచ్‌కు చెందిన పోలీస్ కానిస్టేబుల్ వెంకట్ రామ్ (గ్రూ.5393) అకాల మరణం పట్ల తోటి కానిస్టేబుళ్లు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి అండగా నిలవాలనే ఉద్దేశంతో 2009 బ్యాచ్ పోలీస్ కానిస్టేబుళ్లందరూ కలిసి రూ.3 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించారు. కష్టకాలంలో బాధిత కుటుంబానికి అండగా నిలవడం తమ బాధ్యతగా భావించి ఈ సాయాన్ని అందించినట్లు తెలిపారు. వెంకట్ రామ్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, వారికి మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.

VOICE OF PRAJALU
వాయిస్
ప్రజల గొంతుక - నిజం కోసం.. ఆఫ్ ప్రజలు
హైదరాబాద్
సోమవారం 12 అక్టోబరు 2026

నేటి సోమవారం జిల్లా స్థాయి ప్రజావాణి కార్యక్రమం రద్దు

- యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



(యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో.. వాయిస్ టుడే ప్రతినిధి):- జిల్లాలో ప్రతి సోమవారం నిర్వహించే జిల్లా స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని ఈ సోమవారం (అక్టోబర్ 12)న రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.రాష్ట్రంలో నెలకొన్న ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రబీ పంటల ప్రణాళిక, పంటల సాగు విధానాలు, పంటల వైవిధ్యీకరణ, వ్యవసాయ నిర్వహణ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించేందుకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రైతులను ఉద్దేశించి ప్రసంగించనున్న నేపథ్యంలో, అక్టోబర్ 12వ తేదీ (సోమవారం)న నిర్వహించనున్న రైతు నేస్తం కార్యక్రమం సందర్భంగా కలెక్టరేట్‌లో నిర్వహించే జిల్లా స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు స్పష్టం చేశారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి తమ వినతులు, ఫిర్యాదులతో సోమవారం కలెక్టరేట్‌కు రావద్దని కలెక్టర్ కోరారు.

భువనగిరి పెద్ద చెరువు వద్ద ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు

భువనగిరి మున్సిపల్ చైర్పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి

బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి



(యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో.. వాయిస్ టుడే ప్రతినిధి):- తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగలో భాగంగా ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలను భువనగిరిలో ఘనంగా నిర్వహించారు. మహిళలు వివిధ రకాల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ ఆటపాటలతో సందడి చేశారు. భువనగిరిలోని పెద్ద చెరువు వద్ద బతుకమ్మ ఉత్సవాలను మున్సిపల్ చైర్‌పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ ప్రారంభించారు. ఆమె తోటి మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతూ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతిపై ప్రేమకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ మహిళల ఆటపాటలతో పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో బతుకమ్మ పండుగ కీలక పాత్ర పోషిస్తుందని ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల కౌన్సిలర్లు పట్టణ ప్రజలు పాల్గొన్నారు.



శ్రీ దుర్గా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

భువనగిరి పట్టణంలోని మీనా నగర్లో గణం

:- భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్

(యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో.. వాయిస్ టుడే ప్రతినిధి):- వీర శివాజీ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమైన శ్రీ దుర్గా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భువనగిరి పట్టణం లోని మీనా నగర్లో వీర శివాజీ యూత్ ఆధ్వర్యంలో శ్రీ దుర్గా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. 28 వార్డు కౌన్సిలర్ సూదగాని సరిత గౌడ్ వీరశివాజీ యూత్ అధ్యక్షులు సూదగాని రాజు ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవాలలో మున్సిపల్ చైర్మన్ తంగేళ్లపల్లి శ్రీవాణి, వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల, కౌన్సిలర్లు బర్రె పూజత , కుక్కదూవు పద్మ, బుర్హానుద్దీన్, చల్లగురుగుల కృష్ణవేణి, నాయిని అరుణ, వివిధ పార్టీల నాయకులు తంగేళ్లపల్లి రవికుమార్, మాజీ చైర్మన్ బర్రె జహంగీర్, కుక్కదూవు సోమయ్య, పట్టణ బీజేపీ అధ్యక్షులు రత్నపురం బలరాం, మాదాసు గోవర్ధన్, ఉత్సవాల కోశాధికారి పోత్నక్ సన్నీ, వీర శివాజీ యూత్ సభ్యులు పచ్చిమట్ల రాజు, బండారు రఘు, రంగ రంజిత్, కరిపే సురేష్ పాల్గొన్నారు.

అశ్వరావుపల్లి ప్రాజెక్టు కాల్వలో నీటి ప్రవాహం పెంచాలి

:- ప్రభుత్వ విప్పు ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



(యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో.. వాయిస్ టుడే ప్రతినిధి):- ఆలేరులోని అశ్వరావుపల్లి ప్రాజెక్టు నుంచి ఆలేరు మీదుగా టంగుటూరు, గోలనుకొండ గ్రామాలకు వెళ్లే కాల్వను గోలనుకొండ వద్ద తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య సందర్శించారు. ఈ సందర్భంగా నీటి ప్రవాహాన్ని పెంచాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య సంబంధిత అధికారులను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాల్వ ద్వారా ఆయా గ్రామాలకు తగినంత నీరు అందేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు సాగునీటి విషయంలో ఇబ్బందులు తలెత్తకుండా కాల్వలో నీటి ప్రవాహాన్ని పెంచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు.టంగుటూరు, గోలనుకొండ గ్రామాల రైతులకు సాగునీరు అందేలా నీటి విడుదలను పర్యవేక్షించాలని, క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని బీర్ల అయిలయ్య కోరారు.





పల్లవి మోడల్ స్కూల్‌లో ఘనంగా దాండియా సంబరాలు

భిన్న సంస్కృతుల సమ్మేళనంగా 'రాస్, రంగ్ అండ్ రివెల్రీ--2026'



హైద్రాబాద్ (వాయిస్ టుడే): బోయిన్‌పల్లిలోని పల్లవి మోడల్ స్కూల్ ఆధ్వర్యంలో హస్మత్‌పేట్ రోడ్డులోని నిమ్స్ గ్రౌండ్‌లో నిర్వహించిన 'రాస్, రంగ్ అండ్ రివెల్రీ--దాండియా నైట్ 2026' వేడుకలు ఘనంగా జరిగాయి. రంగురంగుల సంప్రదాయ దుస్తులు, సంగీతం, గర్బా, దాండియా నృత్యాలతో ప్రాంగణం సందడిగా మారింది. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎం. కొమరయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు, కామారెడ్డి డీసీసీ అధ్యక్షుడు అలే మల్లికార్జున్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యులు భానుక నర్మద, మల్లికార్జున్ ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు. తిరుమలగిరి లా అండ్ ఆర్డర్ ఏసీపీ జి. రమేష్, ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు, ఖార్ఖానా సీఐ అనురాధ, ఎస్ఐలు జయంతి, ఆనంద్ రాజు హాజరయ్యారు. ప్రముఖ మోడల్ శ్రీలహరి వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

దీపప్రజ్వలనతో ప్రారంభమైన వేడుకల్లో బతుకమ్మ సంబరాలు, భజన కార్యక్రమం, గర్బా నృత్యాలు, బెంగాలీ సంప్రదాయ ధాక్ బాజా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం నిర్వహించిన దాండియా నృత్యాల్లో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. లక్కీ డ్రాలో ఎయిర్ ఫ్రయ్యర్లు, స్మార్ట్‌వాచ్‌లు, రైస్ కుక్కర్లు తదితర బహుమతులను విజేతలు అందుకున్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ సుప్రభా హాని, వైస్ ప్రిన్సిపాల్, పరిపాలనా బృందం, ఉపాధ్యాయులు, సిబ్బంది కార్యక్రమ నిర్వహణలో కీలక పాత్ర పోషించారు. 'ఒకే భారతదేశం--అనేక సంప్రదాయాలు' అనే ఇతివృత్తంతో నిర్వహించిన ఈ వేడుక భారతీయ సంస్కృతిలోని వైవిధ్యాన్ని, భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటిందని నిర్వాహకులు తెలిపారు.



బీజేవైఎం యువమోర్చా నాయకుడు రేవల్లి రాజు లేకపోవడం బాధాకరం

- బీజేవైఎం నాయకులు

ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి):- భారతీయ యువ మోర్చా నాయకుడు రేవెల్లి రాజు ప్రథమ వర్ధంతి సందర్భంగా ఉప్పల్ డివిజన్ బీజేవైఎం ఆధ్వర్యంలో అభి సాయి దత్త ట్రస్ట్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అనాథ పిల్లలకు భోజన సదుపాయాలు కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ బీజేపీ సీనియర్ నాయకులు గోరిగె కృష్ణ, రావుల బాలకృష్ణ గౌడ్, రెడ్డిగారి దేవేందర్ రెడ్డి, బొరంపేట మురళీకృష్ణ, ఆతికం విజయ్ గౌడ్,అలాగే బీజేవైఎం నాయకులు నామ శ్రవణ్, గోరిగె శ్రీకాంత్, రావుల అఖిలేష్ గౌడ్, ఈదులకంటి నవీన్ గౌడ్, గోరిగె భరత్, ఆకుల రుషికేష్, గోరిగె మణికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

లక్కీ గైస్ -- ది మల్టీబ్రాండ్ స్టోర్‌ను ప్రారంభించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

రామంతాపూర్‌లో ఘనంగా లక్కీ గైస్ మల్టీబ్రాండ్ స్టోర్ ప్రారంభోత్సవం



ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిది):- రామంతాపూర్‌లోని గణేష్ నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన లక్కీ గైస్ -- ది మల్టీబ్రాండ్ స్టోర్‌ను ఆదివారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ స్టోర్‌లో పురుషుల దుస్తులు, మహిళల దుస్తులు, ఫుట్‌వేర్, ఫ్యాషన్ యాక్సెసరీస్‌తో పాటు వివిధ రకాల లైఫ్‌స్టైల్ ఉత్పత్తులను ఒకే చోట అందుబాటులో ఉంచడం అభినందనీయమని పేర్కొన్నారు.రామంతాపూర్ పరిసర ప్రాంతాల ప్రజలకు వివిధ బ్రాండ్లకు చెందిన వస్త్రాలు, ఫ్యాషన్ ఉత్పత్తులు ఒకే చోట లభించడం సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపారు. నూతనంగా వ్యాపారాన్ని ప్రారంభించిన నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వ్యాపారం విజయవంతంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్టోర్ నిర్వాహకులు, స్థానిక నాయకులు,తదితరులు పాల్గొన్నారు.



శ్రీ మార్కండేయ ఆలయ కమాన్ ప్రారంభోత్సవంలో ఎంపీ ఈటల రాజేందర్‌తో కలిసి పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి):-రామంతాపూర్‌లోని ఇందిరానగర్‌లో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీ మార్కండేయ ఆలయ కమాన్‌ను ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై కమాన్ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆలయ కమాన్ ప్రారంభోత్సవం నిర్వహించడం పట్ల పద్మశాలి సంఘం ప్రతినిధులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు, స్థానిక నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఘనంగా ఎంఎస్ రెడ్డి లయన్స్ కంటి ఆసుపత్రి సిల్వర్ జూబ్లీ వేడుకలు

25 ఏళ్లుగా కంటి వైద్య సేవలు.. ముఖ్య అతిథిగా డాక్టర్ గట్టమనేని బాబు రావు



నాగారం, అక్టోబరు 11:-(వాయిస్ టుడే) లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ -- మీ రిపేట్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎంఎస్ రెడ్డి లయన్స్ కంటి ఆసుపత్రి 25వ వార్షికోత్సవం (సిల్వర్ జూబ్లీ) వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మేడ్చల్ -- మల్కాజిగిరి జిల్లాలోని కాప్రా సర్కిల్ పరిధిలో రాధిక థియేటర్ సమీపంలోని స్వాగత్ గ్రాండ్ హోటల్‌లో ఈ కార్యక్రమం జరిగింది. పాతికేళ్లుగా ప్రజలకు కంటి వైద్య సేవలందిస్తున్న ఆసుపత్రి ప్రస్థానాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వేడుకలకు లయన్స్ క్లబ్ ప్రతినిధులు, ట్రస్ట్ సభ్యులు, వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది హాజరయ్యారు.

ఈ వేడుకలకు లయన్స్ క్లబ్ మాజీ అంతర్జాతీయ డైరెక్టర్ డాక్టర్ గట్టమనేని బాబు రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మల్టిపుల్ కౌన్సిల్ చైర్‌పర్సన్ లయన్ ఏ. అమర్‌నాథ్ రావు, జిల్లా గవర్నర్ లయన్ కల్లెం కృష్ణారెడ్డి గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. ప్రత్యేక ఆహ్వానితులుగా లయన్ కే. హరీశ్ రెడ్డి, లయన్ కే. ఇన్నా రెడ్డి, లయన్ మంద సురేశ్ కుమార్, లయన్ గుంటుక శేఖర్ రెడ్డి తదితరులు హాజరయ్యారు.

పాతికేళ్లుగా కంటి వైద్య సేవలు...

లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్--మీరిపేట్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎంఎస్ రెడ్డి లయన్స్ కంటి ఆసుపత్రి, ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ (ఎల్వీపీఈఐ) అనుబంధ సంస్థగా కంటి వైద్య సేవలందిస్తోంది. కంటి ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొస్తోంది. ఆసుపత్రి 25 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన సిల్వర్ జూబ్లీ వేడుకలు ప్రత్యేకతను సంతరించుకున్నాయి. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ఛైర్మన్ లయన్ చింతల రాంచందర్, కార్యదర్శి లయన్ పొలాస రమేశ్, కోశాధికారి లయన్ ఎస్. అంజిరెడ్డి పాల్గొన్నారు. ఆసుపత్రి సేవలను మరింత విస్తరించడం, భవిష్యత్తులోనూ ప్రజలకు మెరుగైన కంటి వైద్య సేవలు అందించడం వంటి అంశాల్లో సిల్వర్ జూబ్లీ వేడుకలు ప్రాధాన్యాన్ని చాటాయి. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు, ట్రస్ట్ సభ్యులు, వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

VOICE OF PRAJALU
వాయిస్
ప్రజల గొంతుక - నిజం కోసం..
ఆఫ్ ప్రజలు

హుగ్గెల్లిలో తాగునీటి సమస్య పరిష్కారం

మఠం వద్ద నూతన బోరు మోటార్‌ను ఏర్పాటు చేయించిన సర్పంచ్ పట్లోళ్ల విమల శ్రీనివాస్‌రెడ్డి

జహీరాబాద్,వాయిస్ టుడే అక్టోబర్ 11:మండల పరిధిలోని హుగ్గెల్లి గ్రామంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా గ్రామ పంచాయతీ ప్రత్యేక చర్యలు చేపట్టింది. గ్రామంలోని స్థానిక మఠం సమీపంలో ఉన్న బోరుబావికి గ్రామ సర్పంచ్ పట్లోళ్ల విమల శ్రీనివాస్‌రెడ్డి పర్యవేక్షణలో నూతన విద్యుత్ మోటార్‌ను అమర్చారు. గత కొద్దిరోజులుగా బోరు మోటార్ సమస్యతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించిన సర్పంచ్, వెంటనే స్పందించి కొత్త మోటార్‌ను ఏర్పాటు చేయించి నీటి సరఫరాను పునరుద్ధరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ ప్రజలకు ఎలాంటి తాగునీటి ఇబ్బందులు కలగకుండా చూడటమే తమ ప్రధాన లక్ష్యం. గ్రామంలోని ప్రతి కాలనీ, వార్డులో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తున్నాం. రాబోయే రోజుల్లోనూ ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు నిరంతరం అందుబాటులో ఉంటామని పేర్కొన్నారు. సకాలంలో స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించినందుకుగాను గ్రామ ప్రజలు సర్పంచ్ పట్లోళ్ల విమల శ్రీనివాస్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు.



శ్రీరామ్ నగర్ అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు

వాయిస్ టుడే/యాదగిరిగుట్ట: జే .ఎల్ .ఎన్. ఎస్. యూత్ అసోసియేషన్స్ శ్రీరాంనగర్ కాలనీలో మహిళల సందడి ప్రకృతి ప్రసాదించిన రంగు రంగుల పూలతో అందంగా అలంకరించి. బతుకమ్మ ఉయ్యాల పాటలతో పేర్చి. వాటి చుట్టూ మహిళలు ఓకే రంగు చీరలు కట్టుకొని బతుకమ్మ పాటలతో నృత్యాలు చేస్తూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు తెలంగాణ ఆడపడుచులు ఎంగిలి పూల బతుకమ్మ సంబరాలు రంగ రంగ వైభవంగా పెద్దసంఖ్యలో పాల్గొన్నారు బతుకమ్మ పండుగ జరుపుకున్నారు.



మాజీ సైనికులను సత్కరించిన జె కె శేఖర్ యాదవ్

కుత్బుల్లాపూర్ అక్టోబర్ 11(వాయిస్ టుడే) సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా ఉదయం హుడా పార్క్ లో కెప్టెన్ భీమయ్య మరియు బిజెపి ఎక్స్ సర్వీస్ మెన్ రాష్ట్ర సెల్ కన్వీనర్ శ్రీనివాసరావు మరియు వారి బృందానికి జెకె శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో శాలువాలతో వారిని సన్మానించినారు. శేఖర్ యాదవ్ మాట్లాడుతూ సైనికులు యొక్క సేవలకు మనం వెలకట్టలేము బార్డర్లో వారి ప్రాణాలను ఫణంగా పెట్టి మన దేశ రక్షణ మన ప్రారక్షణ కోసం వారు ఎన్నో కష్ట నష్టాలకు ఓర్చి కుటుంబాన్ని పిల్లలను వదిలిపెట్టి ఈ యొక్క దేశ భద్రత ముఖ్యమని విధులు నిర్వహిస్తారు. ఆ విధుల్లో అమరులైన వారు ఎంతో మంది ఉన్నారు కాబట్టి వారి రుణం మనం తీర్చుకోలేనిది అందుకే ఈ దేశానికి వెన్నెముకలనటువంటి ఇద్దరు జై జవాన్ జై కిసాన్ అన్నారు. ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ కార్పొరేటర్ రావుల శేషగిరి మరియు వివిధ నాయకులు యువకులు తదితరులు పాల్గొన్నారు. మరియు రాష్ట్ర ఎక్స్ సర్వీస్ మెన్ సెల్ కన్వీనర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వారి మిత్రబృందంతో భీమయ్య సత్కరించి వారి సేవలు కొనియాడారు.



భరత్ నగర్ కాలనీలో పోలీసుల అవగాహన సదస్సు

కాలనీ సమస్యలపై సానుకూలంగా స్పందించి చర్యలు తీసుకోవాలి: డాక్టర్ పి. నాగిరెడ్డి

కూకట్‌పల్లి: అక్టోబర్ 11(వాయిస్ టుడే): భరత్‌నగర్ కాలనీలోని శ్రీ పోచమ్మ ఆలయ ప్రాంగణంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు డాక్టర్ పి. నాగిరెడ్డి ఆధ్వర్యంలో పోలీసుల అవగాహన సదస్సు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బాలానగర్ ఏసీపీ పి. నరేష్ రెడ్డి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ స్వామి గౌడ్, ఇన్‌చార్జ్ ఎస్ఐ తుకారాం, చంద్రశేఖర్ హాజరయ్యారు. సనత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధి నుంచి కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోకి భరత్ నగర్ కాలనీ వచ్చిన సందర్భంగా పోలీసు అధికారులకు కాలనీ వాసులు శుభాకాంక్షలు తెలిపారు. కాలనీలో నెలకొన్న సమస్యలపై సానుకూలంగా స్పందించి, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం, దేవాలయ కమిటీ సభ్యులు సూర్యనారాయణ మూర్తి, నాగేశ్వర్ రావు, బాబు, నరేష్ కుమార్, మధు, వెంకటేష్ యాదవ్, అశోక్ ముది, అనూష, శ్రీదేవి, రాజ్ శ్రీనివాస్, వెంకటేష్, విజయ్ కుమార్, శారద, చందు యాదవ్, భిక్షపతి గౌడ్, సత్యనారాయణ, రాంబాబు, వేణుగోపాల్, సాయి రెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అమృత్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పండ్లు బ్రెడ్ పంపిణీ



మక్తల్ అక్టోబర్ 11 వాయిస్ టుడే ప్రతినిధి: మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పి నరసింహ గౌడ్ మాతృమూర్తి స్వర్గీయ పి లక్ష్మమ్మ గారి 20వ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో శనిరవారం ఉదయం అమృత్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆస్పత్రిలోని మహిళలకు పండ్లు బెడ్స్ పంపిణీ చేయడం జరిగింది ఈ సందర్భంగా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పి నరసింహ గౌడ్ మాట్లాడుతూ తన తల్లి వర్ధంతి సందర్భంగా నిరుపేదలకు ఏదో ఒక సేవా కార్యక్రమం చేయాలని లక్ష్యంతో ఈరోజు మహిళలకు బెడ్లు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు వారి ఆత్మకు ఆ భగవంతుడు మనశాంతిని కలిగించాలని ఆయన ఆ భగవంతుని ప్రార్థించారు భవిష్యత్తులో అమృత్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తానని తెలిపారు ఈ కార్యక్రమంలో నల్గొండ మాజీ సర్పంచ్ కొత్తకాపు గోవర్ధన్ రెడ్డ జుట్ల శంకరు చందాపురం అశోక్ కుమార్ గౌడ్ బండారి ఆనందు ఎల్లిగండ్ల బాలప్ప ఆంజనేయులు పండు జయప్రకాష్ వైద్య శాఖ సిబ్బంది భీమేష్ శ్రీలత మంజుల తదితరులు పాల్గొన్నారు

చిన్నక్రాంతి కాలనీలో ఘనంగా ఎంగిలి పూల బతుకమ్మ వేడుకలు

సికింద్రాబాద్, అక్టోబర్ 11 (వాయిస్ టుడే ప్రతినిధి): తెలంగాణ సాంస్కృతిక ప్రతీక, ఆడపడుచుల ఆత్మబంధువైన బతుకమ్మ పండుగ వేడుకలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. మేడ్చల్ జిల్లా చెంగిచర్ల డివిజన్ పరిధిలోని చిన్నక్రాంతి కాలనీలో తొలి రోజైన ఎంగిలి పూల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు.చిన్నక్రాంతి కాలనీ హౌస్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం బతుకమ్మ సంబురాలు కన్నుల పండుపగా జరిగాయి. కాలనీ మహిళలంతా ఒక్కచోట చేరి, రంగురంగుల పూలతో తీరొక్క బతుకమ్మలను అందంగా అలంకరించి వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. గౌరమ్మను భక్తిశ్రద్ధలతో పూజించి, బతుకమ్మ చుట్టూ చప్పట్లు కొడుతూ తెలంగాణ పాటలకు లయబద్ధంగా ఆడారు. ఈ వేడుకలతో కాలనీ వాడలన్నీ బతుకమ్మ పాటలతో మార్మోగాయి.ఈ సందర్భంగా కాలనీ హౌస్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మేడ బాపురాజు మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతిని, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో బతుకమ్మ పండుగ కీలకపాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. కులమతాలకు అతీతంగా అందరూ కలిసికట్టుగా ఈ వేడుకలు జరుపుకోవడం ఎంతో ఆనందదాయకమన్నారు. ఆడపడుచులందరూ సుఖసంతోషాలతో, ఐక్యతతో ఉండాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాలనీ మహిళలు, అసోసియేషన్ ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో స్థానికులు పాల్గొని పండుగను విజయవంతం చేశారు.



రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి గెలుపుకు కృషి చేయాలి: కంకణాల హర్ష పిలుపు



సూర్యాపేట జిల్లా (వాయిస్ టుడే): అక్టోబర్ 12: ఖమ్మం--నల్గొండ--వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ఖరారు చేసిన అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూర్యాపేట జిల్లా యువ వ్యాపారవేత్త కంకణాల హర్ష పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పట్టభద్రుల సమస్యలు, వారి ఆకాంక్షలకు ప్రాధాన్యతనిస్తూ ఎన్నికల్లో అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగుతూ పట్టభద్రులను కలిసి అభ్యర్థికి మద్దతుగా ప్రచారం నిర్వహించాలని సూచించారు.



జనసేన వీర మహిళల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్

కూకట్‌పల్లి: అక్టోబర్ 11(వాయిస్ టుడే): గాయత్రి నగర్ డివిజన్‌లోని వివేకానంద నగర్ రాయల్ ఓక్స్ స్కూల్‌లో జనసేన పార్టీ వీర మహిళల ఆధ్వర్యంలో రివైవ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర జాయినింగ్ కమిటీ కన్వీనర్ ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రేమ కుమార్ మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డయాబెటిక్ ఫుట్, వెరికోస్ వెయిన్స్, రక్తనాళాల సమస్యలు, మోకాళ్ల సమస్యలు, మెదడు వ్యాధులు, సాధారణ ప్రసవాలు, చిన్నపిల్లల వైద్యం తదితర సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఇలాంటి శిబిరాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రజాసేవా కార్యక్రమాన్ని నిర్వహించిన వీర మహిళలను, ఆసుపత్రి సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జాయినింగ్ కమిటీ సభ్యుడు ప్రజిత్ గౌడ్, కొల్లా శంకర్, శ్రీనివాస్ గోవిందా, పవన్, వీరబాబుతో పాటు వీర మహిళలు దుర్గ లక్ష్మి, రత్న వేణి, నాగ వరలక్ష్మి, రాధిక, సింధు, వాణిదేవి, శ్రీదేవి, సరోజినీ, నారాయణమ్మ, సుజాత, సత్య, భూలక్ష్మి, సత్యవతి, నాగలక్ష్మి, కుమారి, వీర వేణి, విజయలక్ష్మి తదితరులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

మంచిరామిలో విద్యుత్ వైర్ల సమస్యకు పరిష్కారం

సర్పంచ్ ఉప్పు లక్ష్మి చొరవతో 9.1 విద్యుత్ స్తంభం ఏర్పాటు



సుల్తానాబాద్, పెద్దపల్లి జిల్లా అక్టోబర్ 11 వాయిస్ టుడే మండలంలోని మంచి రామి గ్రామంలో బస్టాండ్ ప్రాంతంలో ప్రమాద కరంగా వేలాడుతున్న 11 కేవీ విద్యుత్ వైర్ల సమస్యకు సర్పంచ్ ఉప్పు లక్ష్మి చొరవతో పరిష్కారం లభించింది. బస్టాండ్ ప్రాంతంలో ఆర్టీసీ బస్సులు, ట్రాక్టర్లు, ధాన్యం బస్తాలతో వెళ్లే హార్వెస్టర్ల రాకపోకలకు ఈ విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా మారాయి. సమస్యను గుర్తించిన సర్పంచ్ ఉప్పు లక్ష్మి విద్యుత్ శాఖ అధికారులతో సంప్రదించి, 9.1 విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేపట్టారు. వైర్ల సమస్యను పరిష్కరించారు. ప్రమాదం జరిగే అవకాశం తగ్గడంతో పాటు గ్రామస్తులు, వాహనదారులకు ఇబ్బందులు తొలగాయి. సమస్యను పరిష్కరించేందుకు చొరవ చూపిన సర్పంచ్ ఉప్పు లక్ష్మితో పాటు విద్యుత్ శాఖ అధికారులకు గ్రామ పెద్దలు, పలువురు కృతజ్ఞతలు తెలిపారు.



ప్రశాంత్ నగర్ డివిజన్‌లో బీజేపీ నూతన కార్యవర్గ నియామకాలు

పార్టీ బలోపేతానికి క్రమశిక్షణతో పనిచేయాలి: వడ్డేపల్లి రాజేశ్వరరావు

కూకట్ పల్లి : అక్టోబర్ 11(వాయిస్ టుడే) బీజేపీ ప్రశాంత్ నగర్ డివిజన్ అధ్యక్షుడు గాదె విరన్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన డివిజన్ కార్యవర్గ సమావేశానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి యంజాల పద్మయ్య ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో డివిజన్ పరిధిలో పార్టీని బలోపేతం చేసే లక్ష్యంతో నూతన నియామకాలు చేపట్టారు. వైస్ ప్రెసిడెంట్‌గా ఈరంటి సాయి కుమార్, ప్రధాన కార్యదర్శిగా వినయ్ కుమార్, కార్యదర్శిగా ఆశిష్ ఉపాధ్యాయ, మహిళా మోర్చా అధ్యక్షురాలిగా స్వాతి, ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా విజయ్ కుమార్, బీజేవైఎం అధ్యక్షుడిగా కార్తీక్‌ను నియమించారు. నూతన బాధ్యతలు చేపట్టిన నాయకులను వడ్డేపల్లి రాజేశ్వరరావు శాలువాలతో సత్కరించి అభినందించారు.

ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ.. బీజేపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు క్రమశిక్షణతో, అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని అన్నారు. సీనియర్ నాయకుల అనుభవం, యువ నాయకుల ఉత్సాహంతో ప్రశాంత్ నగర్ డివిజన్‌లో పార్టీని మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఓబీసీ మోర్చా టూర్స్ అండ్ మానిటరింగ్ కన్వీనర్ దిలీప్ కుమార్, జిల్లా ఓబీసీ మోర్చా మీడియా కో-కన్వీనర్ వాడపల్లి శైలజ, బీజేవైఎం నాయకులు చంద్ర ప్రకాష్ రెడ్డి, విక్రాంత్ రెడ్డి, ఉదయ్, ప్రవీణ్, డివిజన్ సీనియర్ నాయకులు గాదె మీన, శ్రీపతి రమేష్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం జయప్రదం చేయండి

ఖమ్మం, అక్టోబర్ 10 (వాయిస్ టుడే): ఈనెల 16న నిర్వహించనున్న యస్ఆర్ ఎబిజీయన్ఆర్ కళాశాల పూర్వ విద్యార్థుల 2వ అపూర్వ సమ్మేళనం ఏర్పాట్లు పూర్తి అయినట్లు కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నల్లమోతు తిరుమలరావు, వి.ఆనంద్ తెలిపారు. ఆదివారం ఖమ్మంలో జరిగిన కార్యవర్గం సమావేశ తీర్మానాలు, వివరాలు పత్రికలకు తెలియజేశారు. యస్ఆర్ఎబి జీయన్ఆర్ కళాశాల పూర్వ విద్యార్థులు అందరినీ ఈకార్యక్రమానికి ఆహ్వానం పలికారు. సమావేశ ప్రారంభంలో ఇటీవల మరణించిన కళాశాల పూర్వ విద్యార్థులకు సంతాపం తెలియజేస్తూ తీర్మానం ఉంటుదన్నారు. సమావేశంలో వివిధ రంగాల్లో రాణించిన 25మంది పూర్వ విద్యార్థులను ఘనంగా సన్మానం చేయడంతో పాటు, వారి సందేశాలు తింటాయన్నారు. అనంతరం సీనియర్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సందేశాలతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని వెల్లడించారు. కార్యక్రమంకు ప్రతి పూర్వ విద్యార్థి హాజరై జయప్రదం చేయాలని కోరారు. యస్ఆర్ బిజీయన్ఆర్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం కళాశాల పూర్వ విద్యార్థులకు పిలుపు నిచ్చింది. ఈకార్యవర్గ సమావేశంలో అలేటి.శ్రీనివాస్, ఇస్మాయిల్, యస్.మణిభూషణాచారి, కట్టెకోల చిన నరసయ్య , సుదర్శన్, నాళ్ళ బానూచందర్ తదితరులు పాల్గొన్నారు.

గన్నవరం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం మండల కార్యదర్శిగా తాటి శివరామకృష్ణ నియామకం

(వాయిస్ టుడే)కృష్ణా జిల్లా/గన్నవరం: కృష్ణాజిల్లా గన్నవరం నియోజకవర్గం వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ (వైఎస్సార్‌సీపీ) యువ నాయకులు, పార్టీ వింగ్ సెక్రటరీ అయిన తాటి శివరామకృష్ణను చేనేత విభాగం మండల కార్యదర్శిగా పార్టీ అధిష్టానం మరియు నియోజకవర్గ పెద్దలు అధికారికంగా నియమించారు. పార్టీ బలోపేతానికి ఆయన చేస్తున్న నిరంతర కృషిని, యువతలో ఆయనకున్న చురుకుదనాన్ని గుర్తించి పార్టీ పెద్దలు ఈ బాధ్యతలు అప్పగించారు. ఈ నియామకం పట్ల గన్నవరం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ శ్రేణులు, కార్యకర్తలు మరియు చేనేత కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన తాటి శివరామకృష్ణ మాట్లాడుతూ... తనపై నమ్మకం ఉంచి ఈ కీలక బాధ్యతలు అప్పగించిన పార్టీ పెద్దలకు, నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ విజయమే లక్ష్యంగా, చేనేత కార్మికుల సంక్షేమం కోసం, వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమిస్తానని, పార్టీ అధినేత ఆశయాలకు అనుగుణంగా సైనికుడిగా పనిచేస్తానని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని తాటి శివరామకృష్ణకు ఘనంగా అభినందనలు తెలిపారు. మరియు శుభాకాంక్షలు తెలియజేశారు.



VOICE OF PRAJALU
వాయిస్
ప్రజల గొంతుక - నిజం కోసం.. ఆఫ్ ప్రజలు
హైదరాబాద్
సోమవారం 12 అక్టోబరు 2026

రాజన్న సిరిసిల్ల జిల్లా ఏర్పాటు ను వ్యతిరేకించిన వారే నేడు ఆవిర్భావ దినోత్సవాలు జరుపుతున్నారు

బీఆర్ఎస్ కార్యక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వ విప్ విమర్శలు

రాజన్న సిరిసిల్ల జిల్లా, సెప్టెంబర్ 11 (వాయిస్ టుడే): రాజన్న సిరిసిల్ల జిల్లా ఆవిర్భావ దినోత్సవం పేరుతో బీఆర్ఎస్ పార్టీ నిర్వహిస్తున్న కార్యక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విమర్శలు గుప్పించారు. జిల్లా ఏర్పాటు సమయంలో ప్రజల డిమాండ్‌ను వ్యతిరేకించిన నాయకులే నేడు జిల్లా ఆవిర్భావ దినోత్సవాలు నిర్వహించడం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానించారు. జిల్లా ఏర్పాటు కోసం ఉద్యమకారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కుల సంఘాలు కలిసి పోరాటం చేసిన విషయాన్ని ప్రజలు గుర్తు చేసుకోవాలని కోరారు.

జిల్లాల పునర్వ్యవస్థీకరణ సమయంలో అప్పటి సిరిసిల్ల ఎమ్మెల్యే, మంత్రి కేటీఆర్ జిల్లా ఏర్పాటు విషయంలో సానుకూలంగా స్పందించలేదని విప్ ఆరోపించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాను ఏర్పాటు చేయడం సాధ్యం కాదని అప్పట్లో జిల్లా ప్రజలకు జిల్లా ఏర్పాటు చేయలేకపోతున్నందుకు క్షమించాలని కోరుతూ కేటీఆర్ బహిరంగ లేఖ రాసినట్లు పేర్కొంటూ, నాటి పరిణామాలను ప్రజలకు వివరించాలని అన్నారు. జిల్లా ఏర్పాటు కోసం ఉద్యమకారులు, స్థానిక ప్రజలు పెద్దఎత్తున ఆందోళనలు నిర్వహించడంతోనే ప్రభుత్వం వెనక్కి తగ్గి రాజన్న సిరిసిల్ల జిల్లాను ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. ఇది బీఆర్ఎస్ సాధించిన





విజయంగా కాకుండా ప్రజల పోరాటం, ఉద్యమకారుల పట్టుదలకు దక్కిన ఫలితంగా చూడాలని అన్నారు. జిల్లా ఏర్పాటు కోసం జరిగిన ఉద్యమ చరిత్రను మరుగునపరిచి, ప్రస్తుతం ఆవిర్భావ దినోత్సవాలను రాజకీయంగా ఉపయోగించు కోవాలని ప్రయత్నించడం సరికాదని విమర్శించారు.

సెప్టెంబర్ 30న రాజన్న సిరిసిల్ల జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొన్న బహిరంగ సభ విజయవంతమైందని పేర్కొన్నారు. సభకు ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారని, ముఖ్యమంత్రి పర్యటనతో జిల్లాలో రాజకీయ వాతావరణం మారిందని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ తన ఉనికిని చాటుకునేందుకు ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాలను నిర్వహిస్తోందని ఆరోపించారు. జిల్లా ఏర్పాటు సమయంలో చోటుచేసుకున్న పరిణామాలకు సంబంధించిన పత్రికా కథనాలను ప్రజల ముందుంచు తామని తెలిపారు. అప్పట్లో జిల్లా ఏర్పాటుపై తీసుకున్న వైఖరికి, ప్రస్తుతం నిర్వహిస్తున్న వేడుకలకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలు గమనించాలని కోరారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఏర్పాటులో ఉద్యమకారుల పాత్రను గుర్తించాలని, జిల్లా కోసం పోరాడిన వారి త్యాగాలు, పట్టుదలను గౌరవించాలని పేర్కొన్నారు. నాటి పరిణామాలపై ప్రజలకు స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత బీఆర్ఎస్ నాయకులపై ఉందని అన్నారు. జిల్లా ఆవిర్భావం వెనుక ఉన్న చరిత్రను ప్రజలు గుర్తుంచుకోవాలని, ఈ అంశంపై రాజకీయ పార్టీల వాదనలను పరిశీలించి వాస్తవాలను తెలుసుకోవాలని కోరారు.



కార్యసిద్ధి హనుమాన్ దేవాలయ అభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గం ఎన్నిక

వరంగల్ (వాయిస్ టుడే) అక్టోబర్ 11: వరంగల్ తూర్పు నియోజకవర్గం పరిధిలోని శంభునిపేట ప్రాంతంలో గల కార్యసిద్ధి హనుమాన్ దేవాలయ అభివృద్ధి కమిటీ తొలి పాలకవర్గాన్ని నూతంగా ఎన్నుకున్నారు. ఆదివారం శంభునిపేట పరపతి సంఘం కార్యవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. పరపతి సంఘం అధ్యక్షులు దేవులపల్లి దయాకర్ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో కార్యసిద్ధి హనుమాన్ ఆలయాభివృద్ధి నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కమిటీలో అధ్యక్షులుగా కందికొండ మోహన్, ప్రధాన కార్యదర్శిగా దేవులపెల్లి శ్రీనాథ్, కోశాధికారిగా కందగట్ల శ్రీ రామ్, ఉపాధ్యక్షులుగా జడల సురేష్ కుమార్, పస్తం రామకృష్ణ, మిర్యాల సంపత్, దేవులపల్లి సుధాకర్, శ్రీధర్, సహాయ కార్యదర్శులుగా సింధం మహేష్, మోర దిలీప్, దేవులపల్లి శ్రీకాంత్, తుర్పాటి మురళీకృష్ణ, గంధం శ్రీనివాస్, సహాయ కోశాధికారిగా జడల రాము తదితరులు ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులచే ఆలయ అర్చకులు బాబు ప్రమాణ స్వీకారం చేయించి ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటి అధ్యక్షులు మోహన్ మాట్లాడుతూ గ్రామ పెద్దలు, పరపతి సంఘం కార్యవర్గం సహాయ సహకారాలతో కమిటీ సభ్యులం ఆలయాభివృద్ధికి కృషి చేద్దామని అన్నారు. ఈ కార్యక్రమంలో పరపతి సంఘం కార్యవర్గ సభ్యులు కోమాకుల పూర్ణ, పసునూటి కోటేశ్వర్, ఆడెపు చందర్, దేవులపల్లి కమలాకర్, సత్యం, శరత్, ప్రభాకర్, రవీందర్, సోమేశ్వర్, జనార్ధన్, రాజేంద్ర ప్రసాద్, వీరస్వామి, తదితరులు పాల్గొన్నారు.



రాహుల్ పోరాటానికి మద్దతుగా ఢిల్లీకి బయలుదేరిన ఎమ్మెల్యేలు

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి.. అరెస్టు చేయాలని కాంగ్రెస్ డిమాండ్

హనుమకొండ, అక్టోబర్ 11 (వాయిస్ టుడే): ఓటు చోరీ ఆరోపణలపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ చేపడుతున్న పోరాటానికి మద్దతుగా టీపీసీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'ఛలో ఢిల్లీ -- నేనుసైతం' కార్యక్రమంలో పాల్గొనేందుకు ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు కే.ఆర్ నాగరాజు, నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, దొంతి మాధవరెడ్డి, గంద్ర సత్యనారాయణ, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, తదితరులు ఆదివారం సాయంత్రం ఢిల్లీకి బయలుదేరారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, ఓటు హక్కు పరిరక్షణ లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న ఉద్యమానికి సంఘీభావంగా ఎమ్మెల్యే ఢిల్లీ పర్యటన చేపట్టారు. ఓటు చోరీకి సంబంధించిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని, కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయడంతో పాటు ఆయనను అరెస్టు చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోందని వారు తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ప్రాధాన్యతను కాపాడాలని, ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసాన్ని నిలబెట్టాలని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా తెలంగాణకు చెందిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర కాంగ్రెస్ పార్టీ నాయకులు ఢిల్లీకి తరలివెళ్తున్నారు.



బతుకమ్మ సంబరాలకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ

వేడుకల నిర్వహణ స్థలాన్ని పరిశీలించిన మాజీ చీఫ్ విప్ వినయ్ భాస్కర్

హనుమకొండ జిల్లా, అక్టోబర్ 11(వాయిస్ టుడే): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించేందుకు హనుమకొండలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా రేపు వడ్డేపల్లి బండ్, ఫాతిమా జంక్షన్‌లో నిర్వహించనున్న బతుకమ్మ సంబరాల ప్రాంగణాన్ని మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్ పరిశీలించారు. వేడుకలకు హాజరయ్యే మహిళలు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, మన ప్రాంత సంస్కృతి వైభవానికి ప్రతీక అని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రకృతితో మమేకమై, రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ పాటలు, ఆటపాటలతో జరుపుకునే ఈ పండుగ తెలంగాణ ప్రజల జీవనశైలిని, ఐక్యతను ప్రతిబింబిస్తుందని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలోనూ బతుకమ్మ పండుగ మన సాంస్కృతిక అస్తిత్వాన్ని చాటిచెప్పిందని, మన సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. మహిళలు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ సంబరాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ పర్యటనలో బీఆర్ఎస్ నాయకులు వద్దిరాజు గణేష్, నార్లగిరి రమేష్, సోదా కిరణ్, సంకు నర్సింగ్, బైరపాక ప్రశాంత్, సుంచు కృష్ణ, కుమ్మరి కోటి లింగం తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు తథ్యం

కాంగ్రెస్ ప్రభుత్వంపై పట్టభద్రుల్లో తీవ్ర వ్యతిరేకత

ఓటరు నమోదుపై పార్టీ శ్రేణులు దృష్టి సారించాలి

పరకాల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

హనుమకొండ జిల్లా, అక్టోబర్ 11(వాయిస్ టుడే) : రాబోయే వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి విజయం సాధించడం ఖాయమని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం సంగెం మండలం గవిచర్ల గ్రామంలో నిర్వహించిన మండల స్థాయి ఎన్నికల సన్నాహక సమావేశంలో పాల్గొన్న ఆయన పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల ఓట్లే కీలకమని, అర్హులైన ప్రతి పట్టభద్రుడిని గుర్తించి ఓటరుగా నమోదు చేయించే బాధ్యత పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. గ్రామస్థాయిలో సమన్వయంతో పనిచేస్తూ ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులు, యువత, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేయకుండా నిరుద్యోగులను నిరాశకు గురిచేసిందని ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ముఖ్యమంత్రి డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ఐక్యంగా పనిచేస్తూ పార్టీ విధానాలను, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను పట్టభద్రుల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడి ఓటు నమోదు చేయించి, ఎన్నికల నాటికి పటిష్టమైన కార్యాచరణతో ముందుకు సాగితే వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి విజయం ఖాయమని చల్లా ధర్మారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు,క్లస్టర్,గ్రామాల ఇంచార్జిలు పాల్గొన్నారు.

నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించాలి

ఉత్సవాలను ప్రారంభంలో ఎమ్మెల్యే నాయిని దంపతులు



హనుమకొండ జిల్లా, అక్టోబర్ 11(వాయిస్ టుడే): దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం తన సతీమణి నాయిని నీలిమ రెడ్డితో కలిసి శ్రీ భద్రకాళి దేవస్థానం, పద్మాక్షి ఆలయం, వేయి స్తంభాల దేవాలయాల్లో అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి నవరాత్రి ఉత్సవాలను అధికారికంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ నవరాత్రి ఉత్సవాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతీకలని పేర్కొన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. వేయి స్తంభాల దేవాలయంలో ప్రతి ఏటా అమ్మవారిని ప్రతిష్ఠించి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోందని తెలిపారు. అనంతరం కుమార్‌పల్లిలో ప్రతిష్ఠించిన అమ్మవారిని ఎమ్మెల్యే దంపతులు దర్శించుకున్నారు. 51వ డివిజన్ పరిధిలోని బీఎల్ఎన్ రెడ్డి కాలనీలో ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ శ్రీరామ్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక డివిజన్ నాయకులు, ఆలయ అర్చకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సిరిసిల్ల పద్మశాలి సంఘం పేరుతో నిర్వహించే కార్యక్రమాలకు తమ సంఘంతో సంబంధం లేదు

సిరిసిల్ల పద్మశాలి సంఘం స్పష్టీకరణ.

సిరిసిల్ల, అక్టోబర్ 11 (వాయిస్ టుడే):కొంతమంది వ్యక్తులు ఇటీవల పద్మశాలి సంఘం పేరు తో ప్రచారం చేస్తున్న సంఘానికి మా సంఘానికి ఎలాంటి సంబంధం లేదని సిరిసిల్ల పట్టణ పద్మశాలి కుల బాంధవులకు, సంఘాల ప్రతినిధులకు, పట్టణ ప్రజలకు, వివిధ రాజకీయ నాయకులకు, పత్రికా ప్రతినిధు లకు సిరిసిల్ల పద్మశాలి సంఘం తరఫున విజ్ఞప్తి చేస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు దూడం శంకర్ పేర్కొన్నారు. సమావేశం లో ఆయన మాట్లాడుతూ, సిరిసిల్లలో పద్మశాలి సంఘం పేరుతో నిర్వహిస్తున్న కొన్ని కార్యక్రమాలకు సంబంధించి తమ సంఘానికి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. పద్మశాలి సంఘం పేరుతో జరుగుతున్న కార్యక్రమాలు, వాటి నిర్వహణ తీరుపై కుల బాంధవులు స్పష్టతతో ఉండాలని కోరారు.సిరిసిల్ల పద్మశాలి సంఘం గత కొంతకాలంగా కొనసాగుతూ, కుల బాంధవుల సంక్షేమం కోసం పనిచేస్తోందని పేర్కొన్నారు. ఈ సంఘానికి అనుబంధంగా 18 సంఘాలు ఉన్నట్లు తెలిపారు. సంఘం పేరును ఉపయోగించు కునే విషయంలో సంబంధిత వ్యక్తులు స్పష్టత పాటించాలని సూచించారు.పట్టణ పద్మశాలి సంఘం పేరుతో నిర్వహించే కార్యక్రమాలకు, సిరిసిల్ల పద్మశాలి సంఘానికి మధ్య ఉన్న సంబంధంపై ప్రజల్లో ఎలాంటి అపోహలు ఉండకూడదని పేర్కొన్నారు. పద్మశాలి కుల బాంధవులు, ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఉపాధ్యక్షులు గాజుల బాలయ్య, మోర రవి, కోశాధికారి ఏళ్లే శ్రీనివాస్ సహాయ కార్యదర్శి కోడం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో వైభవంగా దసరా, బతుకమ్మ వేడుకలు

- భక్తులకు ఘనంగా ఏర్పాట్లు.



వేములవాడ, సెప్టెంబర్ 11 (వాయిస్ టుడే):రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి వారి ఆలయం లో దసరా మరియు బతుకమ్మ సంబురాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ పవిత్ర వేడుకల సందర్భం గా భక్తులు భారీ సంఖ్య లో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుంటు న్నారు.ఆలయం లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా జరుగుతున్నాయి. భక్తులు కోడె మొక్కులు చెల్లించుకునేలా రుద్రా భిషేకాలు, ప్రత్యేక పూజలు, చండీ హోమం, కుంకుమ పూజలు వంటి అర్చనలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు.వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. క్యూలైన్లు, తాగునీరు, ప్రసాద వితరణ తదితర సౌకర్యాలను కల్పించి, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు.

మహాశక్తి ఆలయంలో ఘనంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

తొలిరోజు బాలా త్రిపుర సుందరీ దేవిగా అమ్మవారి దర్శనం

ధ్వజరోహణ మహోత్సవంలో పాల్గొన్న కేంద్ర మంత్రి బండి సంజయ్



కరీంనగర్,అక్టోబర్ 11(వాయిస్ టుడే):నగరంలోని శ్రీ మహాశక్తి ఆలయంలో విజయ దశమి శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా ఆరంభమయ్యాయి. ఆలయాన్ని పూలతో సుందరంగా ముస్తాబు చేశారు.నవరాత్రుల తొలిరోజున అమ్మవారిని శ్రీ బాలా త్రిపుర సుందరీ దేవి (శైలపుత్రి) రూపంలో సూర్యప్రభ అలకంరణ చేశారు. బాలా త్రిపుర సుందరీ దేవి అవతారం శక్తి,జ్ఞానం,ధైర్యం, నిర్మలత్వానికి ప్రతీక. శరన్నవరాత్రుల ఆరంభంలో ఈ బాలరూపాన్ని ఆరాధించడం ద్వారా దైవభక్తితోపాటు మంచి విలువలను జీవితంలో ఆచరించాలనేది సందేశం.బాలా త్రిపుర సుందరీ దేవి ఆరాధన మనిషిలోని నిర్మలత్వాన్ని మేల్కొలిపి,జ్ఞానమార్గంలో నడిపిస్తుందని భక్తుల విశ్వాసం. దుర్గమ్మ అమ్మవారు బాలా త్రిపుర సుందరీ దేవి అలంకారంలో దర్శనమివ్వడం భక్తులకు కనువిందు చేసింది.తొలిరోజు వేలాది భక్తులతో శ్రీ మహాశక్తి దేవాలయం కిటకిటలాడింది. ఉదయం 11 గంటలకు ధ్వజరోహణ కార్యక్రమం నిర్వహించారు.కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ నవరాత్రి ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ధ్వజారోహణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయాన్ని దర్శించుకున్న వేలాది మంది భక్తులు,ముఖ్యంగా భవానీ దీక్షాపరులకు ఆలయ నిర్వాహకులు మధ్యాహ్న భోజనం, సాయంత్రం అల్పాహారం అందించారు.నవరాత్రులు ముగిసే వరకు భోజనం,అల్పాహారం అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.మరోవైపు నవరాత్రి ఉత్సవాలు ముగిసే వరకు ప్రతిరోజు సాయంత్రం బ్రహ్మశ్రీ డాక్టర్ గర్రెపల్లి మహేశ్వర శర్మ 'శ్రీ భాగవత వైభవం'పై ప్రవచన కార్యక్రమం నిర్వహించనున్న ఆలయ నిర్వాహకులు తెలిపారు.అట్లాగే ప్రతిరోజు రాత్రి 9 గంటలకు అధ్యాత్మిక భావన,భక్తి పాటలతో తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా దాండియా కార్యక్రమం నిర్వహించనున్నారు.



కనకదుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే బొజ్జల

శ్రీకాళహస్తి(వాయిస్ టుడే)అక్టోబర్ 11: విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అత్యంత భక్తిశ్రద్ధలతో పట్టువస్త్రాలు సమర్పించి,ముక్కుపుడకను కానుకగా అందజేశారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యేకు దుర్గగుడి ఈవో, చైర్మన్, పాలకమండలి సభ్యులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించినట్లు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి తెలిపారు. శ్రీకాళహస్తి నుంచి వచ్చి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. అనంతరం ఆలయంలోని క్యూలైన్లలో ఉన్న భక్తులతో ఎమ్మెల్యే నేరుగా మాట్లాడి వారికి అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా తగిన సూచనలు చేశారు. అలాగే ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సందర్శించి, నిర్వాహకులు, వైద్య సిబ్బందితో మాట్లాడి భక్తులకు అందుతున్న వైద్య సేవల వివరాలను తెలుసుకున్నారు.

ఎస్ఐఆర్ ప్రక్రియపై గందరగోళం సృష్టించి రాజకీయ ప్రయోజనం పొందడమే కాంగ్రెస్ లక్ష్యం

నకిలీ ఓట్లు,మరణించిన వారి ఓట్లు తొలగించవద్దా...?

బిజెపి జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర



తిమ్మాపూర్,అక్టోబర్ 11(వాయిస్ టుడే): కేంద్ర ఎన్నికల సంఘం పారదర్శకంగా నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీలు అనవసర రాద్ధాంతం చేస్తూ విషప్రచారం చేస్తున్నాయని, ఎస్ఐఆర్ ప్రక్రియపై గందరగోళం సృష్టించి రాజకీయ ప్రయోజనం పొందడమే కాంగ్రెస్ ఏకైక లక్ష్యమని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.బిజెపి తిమ్మాపూర్ మండల అధ్యక్షులు చింతం శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయనమాట్లాడుతూ ప్రధానంగా కాంగ్రెస్,సిజెపి ప్రతిపక్షాలు తమ రాజకీయ ప్రయోజనాల కోసం భారత ఎన్నికల సంఘం బిజెపి ప్రభుత్వంపై చేస్తున్న అసత్య ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు.ఓటర్ల జాబితాను పూర్తి పారదర్శకంగా, జవాబుదారీతనంతో నకిలీ ఓట్లను తొలగించి అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడమే ఎస్ఐఆర్ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. సర్ పై అనవసర రాద్ధాంతం చేయడమే లక్ష్యంగా వ్యవహారాలు చేస్తున్న కాంగ్రెస్, సిజెపి వైఖరి పట్ల ఆయన తీవ్రంగా మండిపడ్డారు.నకిలీ ఓట్లు,మరణించిన వారి ఓట్లు తొలగించవద్ద అని ఆయన ప్రశ్నించారు.ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం ఇదేమి ప్రథమం కాదని,భారత ఎన్నికల సంఘం గతంలో 1952,1957, 1961,1965--66,1983--84,1987--89, 1992--95 2002--2004 లలో ఈ ప్రత్యేక సవరణ ప్రక్రియను నిర్వహించిందని గుర్తు చేశారు.సుదీర్ఘ విరామం తర్వాత 2025 మరియు 2026 లలో దేశవ్యాప్తంగా వివిధ దశల్లో ఈ సర్ సర్వేను చేపట్టిందన్నారు. అయితే ప్రతిపక్ష పార్టీలు ఓటర్లలో గందరగోళం సృష్టించి ఓటు బ్యాంకు రాజకీయం చేయాలని చూస్తున్నాయని విమర్శించారు.ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు స్వచ్ఛమైన ఓటర్ల జాబితాను తయారు చేసేందుకు చేపట్టిన ఈ ప్రక్రియను రాజకీయం చేయడం సరికాదన్నారు.బిజెపి ఓట్ చోరీ చేస్తుందని మాట్లాడుతున్న కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ కాంగ్రెస్ ఓట్ చోరీ తోనే గెలిచి 50 ఏళ్లు దేశాన్ని పాలించిందా..?అనే విషయాన్ని స్పష్టం చేయాల్సిన అవసరం ఉందన్నారు.ప్రజలను గందరగోళానికి గురిచేసి రాజకీయ లబ్ధి పొందాలని ఏకైక ఎజెండాతో కాంగ్రెస్ దేశ వ్యతిరేక శక్తులతో కలిసి పనిచేస్తుందని ఆయన ఆరోపించారు.పూర్తి పారదర్శకతతో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై,చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ పై కాంగ్రెస్ చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలంతా గ్రహించాల్సిన అవసరం ఉందన్నారు.ఢిల్లీ కేంద్రంగా ఆందోళనలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ, సిజెపీలు ఈ విషయంలో చేస్తున్న తప్పుడు ప్రచారాలను,వైఖరిని విడనాడాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో బిజెపి మండలాధ్యక్షులు చింతం శ్రీనివాస్,మాజీ అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వర చారి,ప్రధాన కార్యదర్శి తిరుపతి రెడ్డి,ఓదెలు,బుర్ర శ్రీనివాస్ గౌడ్ మధుకర్ రెడ్డి,శ్రీనివాస్ పాల్గొన్నారు

నగరంలో టీటీడీ ఆలయ నిర్మాణానికి అడుగులు

అక్టోబర్ 17న నిర్మాణ పనులు ప్రారంభం

టీటీడీ అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలించిన మాజీ మంత్రి గంగుల కమలాకర్

శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం తిరుమల ఆలయాన్ని తలపించేలా రూపకల్పన



కరీంనగర్,అక్టోబర్ 11(వాయిస్ టుడే): నగరంలోని పద్మనగర్‌లో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలో నిర్మించనున్న శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి మార్గం సుగమమైంది. ఆలయ నిర్మాణ పనులను ఈ నెల 17న ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు మాజీ మంత్రి,కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తెలిపారు.ఈ నేపథ్యంలో ఆదివారం ఆయన టీటీడీ అధికారులతో కలిసి ఆలయ నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు.నిర్మాణ పనుల ప్రారంభానికి సంబంధించి చేపట్టాల్సిన ఏర్పాట్లు,ఆలయ నమూనాలు, ఇతర అంశాలపై అధికారులతో చర్చించారు. కరీంనగర్‌లో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించాలనే సంకల్పంతో గతంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌తో చర్చించి టీటీడీ అనుమతులు పొందినట్లు గంగుల కమలాకర్ వివరించారు. తాను మంత్రిగా ఉన్న సమయంలో కవిరి భాస్కర్‌రావు, వినోద్‌కుమార్,దామోదర్‌రావులతో కలిసి తిరుమలకు వెళ్లి టీటీడీ అధికారులతో చర్చలు జరిపినట్లు గుర్తుచేశారు.వారి సహకారంతో ఆలయ నిర్మాణానికి అనుమతులు సాధించినట్లు పేర్కొన్నారు. కరీంనగర్ నగరంలోని పద్మనగర్‌లో ఆలయ నిర్మాణం కోసం పది ఎకరాల భూమిని టీటీడీ పేరిట రిజిస్ట్రేషన్ చేసినట్లు గంగుల కమలాకర్ తెలిపారు.భూమికి సంబంధించి వివిధ దశల్లో ఎదురైన అడ్డంకులను అధిగమించి ఆలయ నిర్మాణానికి అవసరమైన ప్రక్రియను ముందుకు తీసుకెళ్లినట్లు వివరించారు. 2023 మే 31న ఆలయ నిర్మాణానికి భూమిపూజ నిర్వహించామని,ఆ సందర్భంగా హోమాలు,ప్రత్యేక పూజలు చేపట్టినట్లు చెప్పారు.ఆలయ నిర్మాణం కోసం మూలవిరాట్టుకు సంబంధించిన ఏర్పాట్లు కూడా చేసినట్లు వెల్లడించారు. భూమిపూజ అనంతరం ఆలయ నిర్మాణానికి సంబంధించిన టెండర్ల ప్రక్రియ చేపట్టినప్పటికీ,ఎన్నికల నేపథ్యంలో పనులు ఆశించిన వేగంతో ముందుకు సాగలేదని గంగుల కమలాకర్ వివరించినట్లు తెలిపారు.ప్రస్తుతం నిర్మాణ పనులు ప్రారంభించేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తవుతున్నాయని పేర్కొన్నారు. అక్టోబర్ 17న మూల నక్షత్రాన్ని పురస్కరించుకుని ఉదయం తొమ్మిది గంటలలోపు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టనున్నట్లు వెల్లడించారు. పద్మనగర్‌లో నిర్మించనున్న ఆలయానికి సంబంధించిన నమూనాలు ఆకర్షణీయంగా రూపొందించినట్లు గంగుల కమలాకర్ తెలిపారు.తిరుమల ఆలయాన్ని తలపించేలా ప్రధాన ద్వారం ఉండటంతో పాటు గర్భాలయం,అర్థమండపం, ముఖమండపం, గరుడాళ్వార్ తదితర నిర్మాణాలతో ఆలయాన్ని తీర్చిదిద్దనున్నట్లు వివరించారు. సంప్రదాయ బద్ధమైన నిర్మాణ శైలిలో స్వామివారి ఆలయాన్ని నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. నగరంలో టీటీడీ ఆధ్వర్యంలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం నిర్మాణం చేపట్టడంసంతోషకరమైన విషయమని గంగుల కమలాకర్ పేర్కొన్నారు.ఆలయ నిర్మాణం పూర్తయితే కరీంనగర్ నగరంతో పాటు పరిసర ప్రాంతాల భక్తులకు స్వామివారిని దర్శించుకునే అవకాశం మరింత చేరువవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఆలయ నిర్మాణ పనులు ప్రారంభమయ్యేలా అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో నగర బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు చల్ల హరి శంకర్,నగర మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్,మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్,కార్పొరేటర్లు గడ్డి ప్రదీప్ యాదవ్,గుగ్గిళ్ళ జయశ్రీ శ్రీనివాస్,మాజీ కొత్తపెళ్లి మున్సిపల్ చైర్మన్ రుద్రరాజు,మాజీ ఎంపీపీ పిల్లి శ్రీలత మహేష్,మాజీ వైస్ ఎంపీపీ తిరుపతి నాయక్,మాజీ కార్పొరేటర్లు బోనాల శ్రీకాంత్,దిండిగాల మహేష్,నాంపల్లి శ్రీనివాస్,మాజీ అర్బన్ బ్యాంకు డైరెక్టర్ కర్ర సూర్య శేఖర్,కరీంనగర్ జిల్లా చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు చిట్టిమల్ల శ్రీనివాస్,టిటిడి ఏఈ నాగరాజు, స్థానిక కాంట్రాక్టర్,మధుసూదన్ రాజు, మాజీ సుడా డైరెక్టర్ నేతి రవివర్మ, నాయకులు పాల్గొన్నారు.



రాజన్న సిరిసిల్ల జిల్లా ఆవిర్భావ దశాబ్ది సందర్భంగా కేసీఆర్, కేటీఆర్ చిత్రపటాలకు పాలాభిషేకం

వేములవాడ పట్టణ బీఆర్ఎస్ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు

వేములవాడ, అక్టోబర్ 11 (వాయిస్ టుడే): రాజన్న సిరిసిల్ల జిల్లా ఏర్పడి పదేళ్లు పూర్తయిన సందర్భం గా వేములవాడ నియోజకవర్గం ఇంచార్జి చల్మెడ లక్ష్మి నరసింహా రావు ఆదేశాల మేరకు పట్టణ బీఆర్ఎస్ శాఖ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ముఖ్య మంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చిత్రపటాలకు పూల మాలలు వేసి, పాలాభిషేకం చేశారు.తెలంగాణ రాష్ట్రంలో కొత్త జిల్లాల ఏర్పాటు ద్వారా పాలనను ప్రజలకు చేరువ చేయాలనే లక్ష్యంతో 2016 అక్టోబర్ 11న రాజన్న సిరిసిల్ల జిల్లా ఏర్పాటైందని నాయకులు గుర్తుచేశారు. జిల్లా ఆవిర్భావం జరిగి పదేళ్లు పూర్తయిన సందర్భంగా ఆనాటి నిర్ణయాల ను, జిల్లాలో జరిగిన అభివృద్ధిని స్మరించుకున్నారు.

ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ, జిల్లా ఏర్పాటుతో పాటు విద్య, వైద్యం, సాగునీరు, రహదారులు మౌలిక సదుపాయాల అభివృద్ధికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేసిందని పేర్కొన్నారు. జిల్లా అభివృద్ధికి కృషి చేసిన నాయకులను, ప్రత్యేక జిల్లా కోసం ఉద్యమించిన ఉద్యమ కారులను ఈ సందర్భం గా గుర్తుచేసుకున్నారు.రాజన్న సిరిసిల్ల జిల్లా మరింత అభివృద్ధి చెందాలని, ప్రజల ఆకాంక్షలు నెరవేరాలని నాయకులు ఆకాంక్షించారు.



ఘనంగా ఆవిర్భావ దశాబ్ది సంబరాలు

కేసీఆర్ చిత్రపటానికి బీఆర్ఎస్ నాయకుల పాలాభిషేకం

'ఉరిశాల' నుంచి 'సిరుల సిరిసిల్ల'గా మార్చిన ఘనత కేటీఆర్‌దే

దశాబ్ది వేడుకల్లో బీఆర్ఎస్ నాయకులు.

సిరిసిల్ల ప్రగతి ప్రస్థానానికి పదేళ్లు విగ్రహాలకు పూలమాలలు, కేక్ కట్ చేసి బీఆర్ఎస్ సంబరాలు

సిరిసిల్ల, అక్టోబర్ 11 (వాయిస్ టుడే): జిల్లా ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో దశాబ్ది సంబరాల ను ఆదివారం అత్యంత వైభవం గా నిర్వహించారు. ఈ సందర్భం గా మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చిత్రపటానికి నాయకులు ఘనంగా పాలాభిషేకం చేశారు. అంతకుముందు తెలంగాణ తల్లి, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, నేతన్న విగ్రహాలకు పూలమాల లు వేసి నివాళులర్పించారు. అలాగే తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన అమరవీరులకు స్మరించు కుంటూ కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన పలువురు ఉద్యమ కారులను ఈ సందర్భంగా పార్టీ నాయకులు ఘనంగా సన్మానిం చారు.?ఈ వేడుకల్లో బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ, ఒకప్పుడు చేనేత కార్మికుల ఆత్మహత్యలతో ఉరిశాలగా పేరొందిన సిరిసిల్ల ను నేడు సిరుల జిల్లాగా మార్చిన ఘనత కేటీఆర్‌కే దక్కుతుందని కొనియాడారు. కేసీఆర్ దార్శనికత, కేటీఆర్ కార్యదక్షత తో పదేళ్ల కాలంలో సిరిసిల్ల రూపురేఖలు పూర్తిగా మారి పోయాయని తెలిపారు. వస్త్ర పరిశ్రమను బలోపేతం చేయడం నేతన్నలకు భరోసా కల్పించడం తో పాటు విద్య, వైద్యం, పట్టణాభివృద్ధి, మౌలిక వసతుల కల్పన లో సిరిసిల్లను రాష్ట్రం లోనే మాడల్‌గా నిలిపారని పేర్కొన్నారు. అమరుల త్యాగాలు, ఉద్యమకారుల పోరాట ఫలితంగానే స్వరాష్ట్రం సిద్ధించిందని, కేసీఆర్, కేటీఆర్ చేసిన అభివృద్ధి సేవలు సిరిసిల్ల ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని స్పష్టం చేశారు.?ఈ కార్యక్రమం లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మాజీ ఎంపీ వినోద్ కుమార్, చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్, మున్సిపల్ చైర్మన్ జిందం కళా చక్రపాణి, సీనియర్ నాయకురాలు తులా ఉమా, వేములవాడ నియోజకవర్గ ఇంచార్జ్ చల్మెడ లక్ష్మి నరసింహా రావు, చిక్కాల రామారావు, గూడూరి ప్రవీణ్, జేఏసీ చైర్మన్లు ఆకునూరి శంకరయ్య, రమాకాంత్‌లతో పాటు జిల్లా, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా విశ్వపాలిని ఆగమనం



రాయికల్ (,వాయిస్ టుడే): కదిలి వచ్చిన కనక దుర్గ...అభయమిచ్చే వరలక్ష్మీ, కోరికలు తీర్చే ఎల్లమ్మ, చదువులు ప్రసాదించే సరస్వతి ఇలా నవదుర్గలు భువికి దిగి కేరళ వాయిద్యాలు, నృత్యాలతో తరలి వచ్చింది..రాయికల్ మార్కండేయ ఆలయంలో తొలి సారి ఏర్పాటు చేస్తున్న విశ్వపాలిని అమ్మ వారు రాయికల్ హనుమాన్ ఆలయం నుంచి పుర రహదారుల గుండా వైభవంగా ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారిని ఆలయం లో ఏర్పాటు చేసిన ప్రత్యేక మండపంలో కొలువు దీర్చారు...చిన్నారుల నృత్యాలు,మహిళల కోలాటాలు అందరినీ ఆకట్టుకున్నాయి..ఈ కార్యక్రమంలో విశ్వపాలిని సేవాసమితి, పద్మ శాలి సంఘం నాయకులు పాల్గొన్నారు.

VOICE OF PRAJALU
వాయిస్ ప్రజల గొంతుక - విజయ కోసం.. ఆఫ్ ప్రజలు
హైదరాబాద్
సోమవారం 12 అక్టోబరు 2026



సహకార సంఘాల్లో మొండి బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలి

రైతులకు రుణాల మంజూరులో ఇబ్బందులు పెట్టొద్దు

ఎమ్మెల్యే కవ్వంపల్లి సూచన

తిమ్మాపూర్,అక్టోబర్ 11(వాయిస్ టుడే): మొండి బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించి సహకార సంఘాల అభివృద్ధికి కృషి చేయాలని మానకొండూరు ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సూచించారు.రైతులకు రుణాలు మంజూరు చేసే విషయంలో ఎలాంటి ఇబ్బందులు కల్పించవద్దని, అవసరమైతే నిబంధనలను సరళతరం చేయాలని అన్నారు.తిమ్మాపూర్ మండలం పోరండ్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) నూతన చైర్మన్‌గా గోపు తిరుపతిరెడ్డితో పాటు పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘాల అభివృద్ధికి పాత బకాయిలు ప్రతిబంధకంగా మారకుండా చూడాలన్నారు. బకాయిల వసూళ్ల విషయంలో ఉదాసీన వైఖరిని వీడి,అవసరమైతే ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని సూచించారు.అదే సమయంలో రైతులకు రుణాల మంజూరులో అనవసర జాప్యం లేకుండా చూడాలని పేర్కొన్నారు.ప్రస్తుతం లాభాల్లో కొనసాగుతున్న పోరండ్ల పీఏసీఎస్‌ను మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు నూతన పాలకవర్గం సమష్టిగా కృషి చేయాలని కోరారు.ముఖ్యంగా కూరగాయలు సాగు చేసే రైతులను ప్రోత్సహిస్తూ,వారి ఆదాయం పెరిగేలా సహకార సంఘం తరపున అవసరమైన సహకారం అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి అక్బరుద్దీన్, స్థానిక సర్పంచ్ అసోద శ్రీనివాస్,కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నర్సయ్య,పీఏసీఎస్ చైర్మన్లు మోరపల్లి రమణారెడ్డి,ఒగ్గు దామోదర్,ముద్దసాని శ్రీనివాస్‌రెడ్డి, తిమ్మాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేష్,పార్టీ నాయకులు గోపు మల్లారెడ్డి,చింతల తిరుపతిరెడ్డి,లక్ష్మారెడ్డి,తుమ్మనపల్లి శ్రీనివాసరావు,ఉంటా రాజేందర్‌రెడ్డి,ద్యావ శ్రీనివాస్‌రెడ్డి,పులి కృష్ణ,లింగాల శ్రీనివాస్, రేమిడి శ్రీనివాస్‌రెడ్డి,గంకిడి లక్ష్మారెడ్డి,రావుల కృష్ణగౌడ్,అయితం వెంకన్న,పొన్నాల సంపత్,కేతిరెడ్డి లింగారెడ్డి,మేడి అంజయ్య, పోలు రాము, రమేష్ పాల్గొన్నారు.



బండారుపల్లిలో మినీ గ్రంథాలయానికి అనుమతి

శ్రీ కాళహస్తి(వాయిస్ టుడే)అక్టోబర్ 11: ఏర్పేడు మండలంలోని బండారుపల్లి గ్రామంలో మినీ గ్రంథాలయం, పుస్తక డిపాజిట్ కేంద్రం ఏర్పాటుకు అనుమతి లభించింది. ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రెడ్డివారి గురువారెడ్డి తన కార్యాలయంలో సంబంధిత అనుమతి పత్రాన్ని పి. చెంచు కృష్ణారెడ్డికి అందజేశారు. ఈ కేంద్రానికి ఆయనను ఇన్‌చార్జిగా నియమించారు.ఈ సందర్భంగా గురువారెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సారథ్యంలో గ్రంథాలయాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మండలంలోని పెద్ద గ్రామమైన బండారుపల్లిలో విద్యార్థులు, పాఠకులకు పుస్తకాలు, దినపత్రికలు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో మినీ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. త్వరలోనే కేంద్రాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని, గ్రామస్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏర్పేడు గ్రంథాలయాధికారి బిలాల్, బండారుపల్లి గ్రామ పార్టీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం యాదవ్, రమేష్, మీనా, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పాస్టర్ల దినోత్సవం సందర్భంగా పాస్టర్ క్రాంతికి ఘన సన్మానం

పాస్టర్ల సేవలు సమాజానికి ఆదర్శం

మైనారిటీ కార్పొరేషన్ కో-ఆర్డినేటర్ అస్మా

జహీరాబాద్,వాయిస్ టుడే అక్టోబర్ 11: పాస్టర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని జహీరాబాద్‌లోని మెథడిస్ట్ సెంట్రల్ చర్చ్ పాస్టర్ శ్రీ క్రాంతిని తెలంగాణ క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ కోఆర్డినేటర్ శ్రీమతి అస్మా శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సమాజానికి పాస్టర్లు అందిస్తున్న ఆధ్యాత్మిక, సామాజిక సేవలను ఆమె ప్రశంసించారు. క్రైస్తవ సమాజ సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం నిరంతరం మద్దతుగా ఉంటుందని అస్మా హామీ ఇచ్చారు. సమాజానికి పాస్టర్లు అందిస్తున్న సేవలు అభినందనీయమని, వారి ప్రార్థనలు, మార్గదర్శకత్వం సమాజానికి ఎంతో బలాన్నిస్తాయని పేర్కొన్నారు. పాస్టర్లందరికీ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారు భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి విజయవంతం కావాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా పాస్టర్ క్రాంతి మాట్లాడుతూ తనను సత్కరించిన తెలంగాణ క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ కోఆర్డినేటర్ అస్మాకు, కార్పొరేషన్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ వైస్ చైర్మన్, ఎస్సీ విభాగం నాయకుడు అమిత్‌రాజ్, చర్చి కార్యదర్శి సత్యానందం, చర్చి కమిటీ పెద్దలు దేవదాస్, సోలమన్ పాల్గొన్నారు.

ఓటరు సమగ్ర సవరణ ఎస్ఐఆర్ పై ప్రతిపక్షాల దుష్ప్రచారం

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నగర డిప్యూటీ మేయర్,మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు



కరీంనగర్,అక్టోబర్ 11(వాయిస్ టుడే): దేశంలో 95 కోట్ల ఓటర్ల సమగ్ర సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్) ప్రక్రియ పూర్తైందని, ప్రతిపక్షాలు ఎస్ఐఆర్ పై దుష్ప్రచారం చేస్తూ ప్రజలను గందరగోళంలోకి నెట్టేస్తున్నారని బీజేపి రాష్ట్ర అధికార ప్రతినిధి డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు అన్నారు. నగరంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియలో 82 కోట్ల మంది ఓటర్లతో పాటు కొత్తగా వచ్చిన ఓటర్ల జాబితాలో అన్ని ప్రక్రియలు పూర్తి చేసుకొని ఎన్‌రోల్మెంట్ కావడం జరిగిందన్నారు.ఇందులో 88 శాతం వరకు పాత ఓటర్ల జాబితాలో ఉన్నవారే ఎన్‌రోల్మెంట్ పూర్తి చేసుకొని కొత్త ఓటర్ల జాబితాలోకి రావడం జరిగిందని తెలిపారు. 13 కోట్ల మంది ఓటర్లు వివిధ దశల్లో విచారణలో ఉన్నారని అన్నారు.2 కోట్ల 89 లక్షల మంది ఓటర్లు మరణించిన ఉన్నారని,ఇందులో వీరు ఉండే అవకాశం లేదన్నారు. దాదాపు 1 కోటి 1 లక్ష మంది ఓటర్లు ఒక్కొక్కరు రెండు నుండి మూడు చోట్ల ఉన్నారని తెలిపారు.ఇలాంటి ఓటర్లు ఇప్పటి వరకు వివిధ దశల్లో విచారణకు కూడ హాజరు కాకపోవడం,బిఎల్ఓలకు సరైన ద్రువపత్రాలు ఇవ్వక పోవడం వల్ల అలాంటి ఓటర్లను షిప్టెడ్, ఆబ్సెంట్,డెత్ కెటగిరీ జాబితో రావడం దరిగిందని తెలిపారు ప్రతి రాజకీయ పార్టీ ఎస్ఐఆర్ కు సంబంధించి బీఎల్ఏ లను నియమించుకొని ఎస్ఐఆర్ పరీశీలన చేసినట్లు తెలిపారు.ఇంత పకడ్బందీగా ప్రక్రియ జరిగినా చాలా ఓటర్లు గైర్హాజరై,వేరే ప్రాంతాలకు వెళ్తే వీరి ఓట్లు ఎక్కడున్నాయని పరిశీలించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.ఫాం 6 ప్రక్రియ నిరంతరంగా కొనసాగే ప్రక్రియ అని తెలిపారు.ప్రతి సంవత్సరం ఓటర్ జాబితాలో 4 సార్లు కొత్త ఓటర్లను ఎంట్రీ చేయడం బిఎల్ఓలు ,రెవెన్యూ అధికారులు విచారణ జరిపి ఏఆర్ ఓ సమక్షంలో ఓటర్ జాబితాలో పొందుపరచడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఎవరినీ ఓటర్ జాబితాలో రాకుండ ఎవరు అడ్డుకోలేరని తెలిపారు. ఫారం 7 ద్వారా ఓటర్లను తొలగించారని ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయి అది అవాస్తవం అన్నారు.ఫాం 7 అనేది ఓటర్ జాబితాలో ఉన్న వ్యక్తులను ఎవరైన ఆబ్జెక్షన్ చేస్తే సంబంధిత ఓటర్ ను పరిశీలన చేసి సరైందా కాదా తెలువడం జరుగుతుందని తెలిపారు.ఇప్పటి వరకు దేశం మొత్తంలో 95 కోట్ల ఓటర్లలో కేవలం 25 లక్షల ఓటర్లు మాత్రమే తొలగించబడ్డారని అన్నారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లా మొత్తం చూస్తే కేవలం 8 వేలు మాత్రమే తొలగించబడ్డాయని తెలిపారు.ప్రతి పక్షాలు ఇన్ని అవాస్తవాలు ప్రజలకు ప్రచారం చేస్తూ లేని పోని దుష్ప్రచారంతో ప్రజలను తప్పుదోవ పట్టించడం చాలా దుర్మార్గం అన్నారు.ఎలాంటి కారణం లేకుండానే ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నాలు చేయడం శోచనీయం అన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వానికి వస్తున్న ప్రజాధరణను ఓర్వలేక ప్రతి పక్షాలు ఎస్ఐఆర్ సాకుతో ప్రభుత్వం పై కుట్రలు చేస్తూ బురదజల్లే ప్రయత్నం లో భాగమేనని మండి పడ్డారు. దేశవ్యాప్తంగా 9 లక్షల బూతులలో అన్ని రాష్ట్రాల్లో ప్రక్రియ జరిగితే ఓట్లు తొలగించడం ఎవరికి అవసరం అన్నారు. ఎవరు ఎవరికి ఓటు వేస్తారని ఎలా గుర్తిస్తారు...? ఓట్లు తెలగించే అధికారం రాజకీయ పార్టీలకు లేదని తేల్చిచెప్పారు గతంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అలాంటి ఓట్లు తొలగించే ప్రయత్నం చేసిందో తెలియదని అనుమానం వ్యక్తం చేశారు.ప్రతి పక్షాలు చేస్తున్న కుట్రను ఖండించాలని మండి పడ్డారు.ఓట్లు చోరీ చేసి గెలావలనుకుంటే 303 వచ్చిన సీట్లు బిజేపికి 240 సీట్ల గ్రాఫ్ ఎలా పడిపోయిందని ప్రశ్నించారు.గ్రామీన ప్రాంతాల్లో స్వచ్ఛమైన ఓటర్ జాబితా సిద్దమైందని,పట్టణాల్లొ మాత్రమే కొంత ఇబ్బందిక పరిస్థితి మాత్రమే ఉందని అన్నారు.ఒక వ్యక్తికి ఒకే ఓటు ఉండాలన్నదే ఎస్ఐఆర్ యొక్క ముఖ్య ఉద్దేశం అన్నారు. కేరళ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, సీఎం రేసులో ఉన్న వ్యక్తులు,ఎస్ఐఆర్ తో లాభం చేరుకూరందని మొన్నటికి మొన్న వాఖ్యలు చేశారు తెలిపారు.దొంగ ఓట్లతో చాలా ఇబ్బందులు ఉండేవని ఎస్ఐఆర్ మాకు హెల్ప్ చేసిందని నేటి కేరళ హోం మంత్రి లాంటి వ్యక్తులు చెబుతా ఉంటే ఇక్కడ మాత్రం సిగ్గ లేకుండ దర్నాలు రాస్తా రోకోలు చేయడం ఎంత వరకు సమంజసం అని నిలదీసారు.జ్ఞానేష్ కుమార్ బీజేపికి వంతపాడారని ఆరోపిస్తున్నారు.2025 లో జ్ఞానేష్ కుమార్ ఎన్నికల కమీషనర్ గా వచ్చారని అంతకు ముందే ఎన్నికలు జరిగాయని స్పష్టం చేశారు.ఎన్నికల కమీషన్ వ్యవస్థను దుర్వినియోగం చేసే చరిత్ర కేవలం కాంగ్రెస్ పార్టీదని ద్వజమెత్తారు.ఎస్ఐఆర్ ప్రక్రియ పేరుతో ప్రతి పక్షాలు చేస్తున్న కుట్ర మాత్రమే అని అన్నారు. పరిశుద్ధమైన జాబితా వల్లే ఎన్నికల శాతం పెరుగుతుందని అన్నారు. ఇలాంటి దిగజారుడు కార్యక్రమాలు చేస్తే బంగ్లాదేశ్, పాకిస్థాన్,లాగా చేయాలని కుట్రలు చేస్తే ఊరుకునే ప్రస్తక్తి లేదన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ కార్పొరేటర్లు తోట అనిల్, మాసం గణేష్,కొంపెల్లి రామన్, సోమిడి వేణు ప్రసాద్,పొన్నం మొండయ్య గౌడ్,కర్రె అనిల్, కోఆప్షన్ సభ్యులు సర్దార్ బల్బీర్ సింగ్,నాయకులు పండుగ నాగ రాజు, వెంకట్ రెడ్డి,నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో శరన్నవరాత్రి బ్రహ్మోత్సవ వైభవం



శ్రీకాళహస్తి(వాయిస్ టుడే)అక్టోబర్ 11: నేటి నుంచే ముగ్గురు అమ్మవార్ల శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కనులవిందుగా అమ్మవార్ల దివ్య అలంకరణలు. భక్తిపారవశ్యంలో శ్రీకాళహస్తి క్షేత్రం దక్షిణ కైలాసంగా,రాహు కేతు పూజలకు ప్రసిద్ధి చెందిన శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రం శరన్నవరాత్రి ఉత్సవాలతో భక్తిపారవశ్యంలో మునిగితేలుతోంది. ఆదివారం నుంచి అమ్మవార్ల శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. కనకాచలంపై కొలువైన శ్రీ కనకదుర్గమ్మ, ప్రధాన ఆలయంలోని శ్రీ జ్ఞానప్రసూనాంబికా దేవి, కొత్తపేటలోని శ్రీ సీతాలమ్మ, శ్రీ ముత్యాలమ్మ అమ్మవార్ల సన్నిధులు ప్రత్యేక పూజలు, అర్చనలు,ఆకర్షణీయమైన అలంకరణలతో కళకళలాడుతున్నాయి ఉత్సవాల తొలి రోజున భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవార్ల దర్శనానికి తరలివచ్చారు.కొండపై వెలసిన కనకదుర్గమ్మ సన్నిధిలో భక్తులు దీపాలు వెలిగించి, నిమ్మకాయ దీపాలతో ప్రత్యేకంగా ఆరాధనలు నిర్వహించారు.అమ్మవార్ల నామస్మరణతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.

బాలా త్రిపుర సుందరి రూపంలో కనకదుర్గమ్మ

శ్రీకాళహస్తీశ్వరస్వామి వారి దేవస్థాన అనుబంధ ఆలయమైన కనకాచలంపై కొలువైన శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారు నవరాత్రుల తొలి రోజు శ్రీ బాలా త్రిపుర సుందరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. ఈ రూపంలో అమ్మవారిని దర్శించుకుంటే విద్యాబుద్ధులు, జ్ఞానం, ఐశ్వర్యం సిద్ధిస్తాయని భక్తుల విశ్వాసం.జ్ఞానప్రసూనాంబికా దేవికి ప్రత్యేక పూజలు శ్రీకాళహస్తీశ్వరస్వామి వారి ప్రధాన ఆలయంలో కొలువైన శ్రీ జ్ఞానప్రసూనాంబికా దేవి అమ్మవారు తొలి రోజు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్నారు. జ్ఞానప్రదాయినిగా కొలిచే జగన్మాతను దర్శించుకునేందుకు భక్తులు తరలివస్తున్నారు. అమ్మవారి కృపాకటాక్షాలు పొందాలని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. కొత్తపేటలోని శ్రీ సీతాలమ్మ అమ్మవారి ఆలయంతో పాటు శ్రీ ముత్యాలమ్మ తల్లి అందంగా శ్రీకాళహస్తి అమ్మవారి ఎదుట బొమ్మల కొలువు దుర్గామాతకు ప్రత్యేక పూజలు సన్నిధిలోనూ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి.అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు చేసి, పూజలు, అర్చనలు నిర్వహిస్తున్నారు. దీంతో శ్రీకాళహస్తి పట్టణంలోని అమ్మవారి ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి.భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు నవరాత్రుల తొలి రోజు నుంచే భక్తుల రాక పెరగడంతో దర్శనానికి వచ్చే వారికి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా సంబంధిత ఆలయాల వద్ద ఏర్పాట్లు చేపట్టారు. తొమ్మిది రోజుల పాటు అమ్మవార్లు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమివ్వనుండటంతో భక్తుల్లో ఆధ్యాత్మిక ఉత్సాహం నెలకొంది. అమ్మవార్లను దర్శించుకుని, వారి కృపాకటాక్షాలతో సకల శుభాలు పొందాలని భక్తులు ఆకాంక్షిస్తున్నారు.



అట్టహాసంగా ప్రారంభమైన నవరాత్రి వేడుకలు

రాయికల్ వాయిస్ టుడే : రాయికల్ పట్టణంలోని చండీ పరివార్ ఆధ్వర్యంలో గుడి కోట ఆలయ ప్రాంగణంలో ఆదివారం నవరాత్రి వేడుకలు అత్తహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆంజనేయ స్వామి ఆలయం నుండి ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో మంగళ వాయిద్యాలు, డీజే చప్పుల్ల నడుమ మాతలు మంగళహారతులతో అమ్మవారికి స్వాగతం పలికారు. త్రికుటాలయంలో నవరాత్రులకు ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో వేద మంత్రోచ్చరాల నడుమ అమ్మవారి దీక్ష స్వీకరించే స్వాములకు మాలాధారణ అనంతరం మంటప స్థాపన, ఘట స్థాపన మరియు అమ్మవార్ల ప్రతిష్టాపన అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో గుడికోట ఆలయ కమిటీ సభ్యులు,మహిళలు భక్తులు దీక్షపరులు తదితరులు పాల్గొన్నారు.



ఆల్ఫోర్స్ హైస్కూల్లో బతుకమ్మ సంబరాలు

రంగురంగుల బతుకమ్మలతో చిన్నారుల సందడి.. మహిళల కోలాహలం!

వాయిస్ టుడే హుస్నాబాద్ ప్రతినిధి: ఆల్ఫోర్స్ ఈ-టెక్నో స్కూల్లో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మల మధ్య విద్యార్థినీ విద్యార్థులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొని పండుగ వాతావరణాన్ని నెలకొల్పారు. చిన్నారుల ఆటపాటలు, మహిళల కోలాహలంతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది. ఈ కార్యక్రమానికి ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వుట్కూరి నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని, ఇలాంటి వేడుకల ద్వారా విద్యార్థుల్లో మన సంస్కృతి పట్ల అవగాహన, సంప్రదాయాల పట్ల గౌరవం పెంపొందుతాయని పేర్కొన్నారు.

సిరిసిల్ల జిల్లా అభివృద్ధిలో కేసీఆర్‌ది కీలక పాత్ర

కోనరావుపేటలో కేసీఆర్, కేటీఆర్ చిత్రపటాలకు బీఆర్ఎస్ నేతల పాలాభిషేకం

జిల్లా ఆవిర్భావ దశాబ్ది వేడుకల్లో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మల్యాల దేవయ్య



కోనరావుపేట, అక్టోబర్ 11 (వాయిస్ టుడే): రాజన్న సిరిసిల్ల జిల్లా ఆవిర్భవించి పదేళ్లు పూర్తయిన సందర్భంగా కోనరావుపేట మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా ఆవిర్భావ దశాబ్ది వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మల్యాల దేవయ్య మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ 14 ఏళ్ల పాటు అలుపెరుగని పోరాటం చేసి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించారని పేర్కొన్నారు. అనంతరం పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాజన్న సిరిసిల్ల జిల్లాతో పాటు తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి విశేష కృషి చేశారని కొనియాడారు. జిల్లాల పునర్వ్యవస్థీకరణ ద్వారా పరిపాలనను ప్రజలకు మరింత చేరువ చేయడంలో కేసీఆర్ ప్రభుత్వం కీలక పాత్ర పోషించిందని తెలిపారు.

కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి కుంటుపడింది

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి పనులు మందగించాయని మల్యాల దేవయ్య విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సాగునీటి ప్రాజెక్టులు, ప్రజలకు అందించిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలో ప్రజలను కలుస్తూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని వివరించాలని సూచించారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, ప్రజాస్వామ్య పద్ధతుల్లో వాటిని ప్రశ్నించాలని కార్యకర్తలకు సూచించారు. జిల్లా ఆవిర్భావ దశాబ్ది సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

Printed by Published by : **Kotha Laxman** on behalf of Kotha Laxman, printed at and published at 10-5-336/2-1, Kishan Nagar, **Editor: Kotha Laxman.**